

యాప్‌ల నుంచి టీచర్లకు ఉపశమనం

- అందుబాటులోకి సింగిల్ యాప్ 'లీప్'
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

విశాఖపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):

బోధన కంటే యాప్‌ల భారం అధికంగా ఉందన్న ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ ఉపశమనం కలిగించే నిర్ణయం తీసుకుంది. పాఠశాలల్లో రోజువారి కార్యకాపాలకు లెర్నింగ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) సింగిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

గత ప్రభుత్వ హయాంలో టీచర్ల నెత్తిన అనేక యాప్‌లను పెట్టారు. పాఠశాలకు ఉదయం వచ్చిన వెంటనే స్కూల్ పరిసరాలు, మరుగుదొడ్ల శుభ్రత, మధ్యాహ్న భోజన వంటశాల వద్ద ఆహార పదార్థాల తయారీ, అనంతరం విద్యార్థులకు వడ్డన, శుభ్రత, పిల్లలు.. టీచర్ల హాజరు, నాడు-నేడు పనులు, కిట్ల వివరాలు, మార్కుల అప్‌డేట్ ఇలా... అనేక యాప్‌లతో ఉపాధ్యాయులు సతమతమయ్యారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వంపై టీచర్లు అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు ఎన్నికల్లో వ్యతిరేకంగా పనిచేశారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యాప్‌ల భారాన్ని తగ్గిస్తామని ఇచ్చిన హామీ మేరకు... అన్ని పనులకు ఒకటే యాప్ కింద 'లీప్'ను అందుబాటులోకి తెచ్చింది. ప్రతి టీచర్ తమ సెల్‌ఫోన్‌లో ఒకేసారి యూజర్ ఐడీ, పాసువర్డుతో యాప్ ఓపెన్ చేస్తే పాఠశాలకు సంబంధించిన మొత్తం సమాచారం ఉంటుంది. ఈ కొత్త యాప్ ఈ నెల 16 నుంచే అందుబాటులోకి వచ్చిందని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఒకటే యాప్ అందుబాటులోకి రావడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఏయూ శతాబ్ది ఉత్సవాలకు సన్నాహాలు

- విజయవంతంగా నిర్వహించడంపై దృష్టి సారించిన వర్సిటీ ఉన్నతాధికారులు
- వేడుకల నిర్వహణకు పలు కమిటీలను నియమించిన వీసీ రాజశేఖర్
- ఈ నెల 26న వేడుకలు ప్రారంభం
- ఏడాది పాటు నిర్వహణ



విశాఖపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ నెల 26 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 26వ తేదీ వరకు శతాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని నిర్ణయించారు. దేశంలో వందేళ్ల చరిత్ర కలిగిన అతికొద్ది విశ్వవిద్యాలయాల్లో ఏయూ కూడా ఒకటి కావడంతో వైభవంగా నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో శతాబ్ది ఉత్సవాలకు అతిథులను ఆహ్వానించే పనిలో వర్సిటీ ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే వర్సిటీ వీసీ జీపీ రాజశేఖర్ గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి నారా లోకేశ్‌తో పాటు పలువురు ప్రముఖులను ఆహ్వానించినట్టు తెలిసింది. ఈ వేడుకలను పకడ్బందీగా ... మిగతా 6వ పేజీలో

తీరంలో ఆకట్టుకుంటున్న సీఎం సైకత శిల్పం

- ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



సైకత శిల్పంపై పూలు చల్లుతున్న టీడీపీ కార్యకర్తలు

బీచ్ రోడ్డు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75వ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని సాగర తీరంలో వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైకత శిల్పం చూపరులను ఆకట్టుకుంటుంది. ఈ సందర్భంగా వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ ప్రజాసేవ ధ్యేయంగా పనిచేసే రాజకీయ నేతగా చంద్రబాబునాయుడు అందరి మదిలో నిలిచిపోతారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిరంతరం పరితపించే వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు. యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకుగాను విశాఖకు భారీ ప్రాజెక్టులను తీసుకువచ్చేందుకు ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ నియామకాలకు అధిక పోటీ డీఎస్సీ..

ఉమ్మడి జిల్లాలో మొత్తం పోస్టులు	1,139
ఎస్జీటీలు	575
స్కూల్ అసిస్టెంట్‌లు	564

- ఎస్జీటీల్లో అత్యధికంగా 335 పోస్టులు ఏజెన్సీలోని గిరిజన ఆశ్రమాల్లో..
- ఎంపీపీ/మునిసిపల్/ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలు 239 మాత్రమే!
- అభ్యర్థులు 35 వేల మంది ఉండవచ్చని అంచనా
- పోస్టులు తగ్గడానికి గత ప్రభుత్వ నిర్వాకమే కారణమా?

విశాఖపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. సుమారు ఆరేళ్ల నుంచి డీఎస్సీ నియామకాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జూన్‌లో నిర్వహించనున్న రాత పరీక్షలకు ఆదివారం నుంచే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.



సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 1,139 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 575, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 564 ఉన్నాయి. సెకండరీ గ్రేడ్ కేటగిరీలో 575 పోస్టులకు గాను గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీలు 335 వుండగా, ఎంపీపీ/మునిసిపల్/ప్రభుత్వ పాఠశాలల్లో 239ఖాళీలు మాత్రమే వున్నాయి. ఉమ్మడి జిల్లాలో డీఈడీ, బీఈడీ/తత్సమాన కోర్సులు చదివి డీఎస్సీ కోసం సుమారు 35 వేలమంది అభ్యర్థులు నిరీక్షిస్తున్నారు. వీరిలో డీఈడీ కోర్సు చేసిన వారికంటే బీఈడీ / తత్సమాన కోర్సులు చదివినవారే ఎక్కువగా ఉంటారని అంచనా వేస్తున్నారు.

పోస్టులు తగ్గడానికి..

పోస్టులు తగ్గిపోవడానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గడమే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఉమ్మడి జిల్లాలో ఎంపీపీ/ప్రభుత్వ పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 5,931 ఉండగా ప్రస్తుతం 5,233 మంది టీచర్లు పనిచేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో 5,143 పోస్టులకుగాను 4,823 మంది పని చేస్తున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జీవో నంబర్- 117ను అమలు చేయడం ద్వారా ప్రాథమిక విద్యను చాలావరకు దెబ్బతీశారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల నుంచి 3,4, 5 తరగతులను సమీపంలో ఉన్న పాఠశాలల్లో విలీనం చేయడం, ఇతరత్రా కారణాలతో అక్కడ చదివే పిల్లలపై ప్రభావం ... మిగతా 6వ పేజీలో

ఉక్కులో ఆగని తొలగింపులు

తాజాగా మరో 170 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తూ జాబితా విడుదల

- స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం మాట తప్పిందంటూ కార్మిక సంఘాల నాయకుల ఆగ్రహం
- కుటుంబాలతో రోడ్డున పడ్డామని కార్మికుల ఆవేదన



ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):

విశాఖ ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. తాజాగా మరో 170 మందిని ఉక్కు యాజమాన్యం తొలగించింది. స్టీల్‌ప్లాంటులో మార్చి 31న 1,503 మంది కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యం తొలగించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆదివారం మరో 170 మందిని తొలగించినట్టు జాబితాను విడుదల చేసింది. కాగా కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని డిమాండ్ చేస్తూ ఈ నెల 16 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని కార్మిక సంఘ నాయకులు ప్రకటించారు. ఈ క్రమంలో 15వ తేదీ రాత్రి ఆర్‌ఎల్‌సీ సమక్షంలో ఉక్కు యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య జరిగిన చర్చల్లో... తాము సమస్యను ప్రభుత్వ పెద్దలను కలిసి వివరిస్తామని కార్మిక సంఘాల నాయకులు పేర్కొనగా, మే 20 వరకు తాము కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ప్రక్రియను నిలిపివేస్తామని ప్లాంట్ యాజమాన్యం పేర్కొంది. అయినప్పటికీ ప్లాంట్ యాజమాన్యం తాజాగా 170 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించింది ఆర్‌ఎల్‌సీ సమక్షంలో జరిగిన చర్చల్లో కార్మికులను తొలగించబోమని చెప్పిన యాజమాన్యం ఇప్పుడు ఇప్పుడు తొలగింపు చర్యలకు పాల్పడడం దారుణమని కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంటులోని పలు విభాగాల్లో శనివారం బీ-షిఫ్ట్ (మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు), సీ-షిఫ్ట్ (రాత్రి 10 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు) విధులకు వచ్చిన వారిలో 170 మంది కాంట్రాక్టు కార్మికులకు ఆదివారం ఉదయం ఆయా కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు ఫోన్ చేసి ఇకపై మీరు విధులకు రానవసరం లేదని, మీ గేటు పాసులను యాజమాన్యం రద్దు చేసిందని చెప్పడంతో వారు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. మే 20 వరకు ఎటువంటి తొలగింపులు చేపట్టబోమని చెప్పిన ఉక్కు యాజమాన్యం నాలుగు రోజుల వ్యవధిలోనే మాట తప్పడం దారుణమని కార్మిక నాయకులు మండిపడుతున్నారు. ఉన్నపలంగా తమను విధుల నుంచి తొలగించడంతో తాము కుటుంబాలతో సహా రోడ్డున పడ్డామని పలువురు కార్మికులు వాపోతున్నారు. కార్మిక వర్గాన్ని ఉక్కు యాజమాన్యం మోసం చేస్తుందని, దీనిపై తాము పోరాటాలకు దిగుతామని కార్మిక నాయకులు తెలిపారు.

కార్మికుల తొలగింపు సరికాదు



కాంట్రాక్టు కార్మికులను మే 20 వరకు తొలగించబోమని ఉక్కు యాజమాన్యం ఆర్‌ఎల్‌సీ సమక్షంలో స్పష్టం చేసింది. కానీ ఇప్పుడు మరో 170 మందిని తొలగించడం సమంజసం కాదు. ఉక్కు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికులపై యాజమాన్యం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. కార్మికుల తొలగింపు ప్రక్రియను నిలిపివేయకపోయినా, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోకపోయినా తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తాం.

\- నీరుకొండ రామచంద్రరావు, ఇంటక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

వేసవిలో నీటి ఎద్దడి నివారణ

రూ.20 కోట్లతో వివిధ రకాల పనులు

- బోర్లు, రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ పనులకు రూ.6 కోట్లు
- 15వ ఆర్థిక సంఘం మొదటి విడత రూ.14 కోట్లు విడుదల
- రోడ్లు, డ్రైన్లు, బోర్ల మరమ్మతు వంటి 725 పనులకు కేటాయింపు
- ఉన్నత పాఠశాలల ఆస్తుల పరిరక్షణకు చర్యలు
- అన్ని జడ్పీ హైస్కూళ్లకు ప్రహరీ గోడలు
- 'ఆంధ్రజ్యోతి'తో జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి

విశాఖపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):



జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు రూపొందించామని, పనులు అమలుచేశామని జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి (సీఈవో) పి.నారాయణమూర్తి పేర్కొన్నారు. ఆయ న 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ, రక్షిత మంచి నీటి పథకాల నిర్వహణ, సిబ్బంది జీతాలు, బోర్లు మరమ్మతులకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.ఆరు కోట్లు కేటాయించామన్నారు. సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్‌లో భాగంగా చేతిపంపుల (బోర్లు) మరమ్మతుకు 15వ ఆర్థిక సంఘం నిధులతో మండల పరిషత్‌లు విడిభాగాలు కొనుగోలు చేశాయని, చేతిపంపులు, నీటి పథకాల మరమ్మతులు పూర్తిచేశామని చెప్పారు. ఇంకా ప్రతి మండలంలో అత్యవసర పనుల కోసం విడిభాగాలు సిద్ధంగా ఉంచామన్నారు. నీటి పథకాలు, బోర్ల మరమ్మతులకు సంబంధించి ఆయా మండలాల్లో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు, సిబ్బంది ... మిగతా 6వ పేజీలో

అతి విశ్వాసమే కొంప ముంచింది..

వైసీపీ నేతల తీరుపై ఆ పార్టీలోనే తీవ్ర అసంతృప్తి!

- కౌన్సిల్‌లో బలం తగ్గిందని తెలిసినా మొండిగా వ్యవహరించారని విమర్శలు
- మేయర్‌తో స్వచ్ఛందంగా రాజీనామా చేయిస్తే బాగుండేదన్న వ్యాఖ్యలు
- అవిశ్వాసం నెగ్గడంతో నేతలు మౌనం దాల్చారని ఆగ్రహం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఆమె మేయర్ పీఠం నుంచి వైదొలిగారు. దీంతో మేయర్ పీఠం కూటమి వశం కానున్నది. సార్వత్రిక ఎన్నికల తర్వాత తమ పార్టీకి చెందిన కార్పొరేటర్లలో 27 మంది మంది, ఇండిపెండెంట్లలో నలుగురు కూటమిలో చేరడంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం పూర్తిగా తగ్గిపోయింది. ఈ విషయం తెలిసి కూడా కూటమి నేతలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోతుందనే భ్రమలో తమ పార్టీ నేతలు పడ్డారని వైసీపీకి చెందిన పలువురు నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. మేయర్‌తో స్వచ్ఛందంగా రాజీనామా చేయించకుండా మొండిగా వ్యవహరించి చివరకు పార్టీ పరువు తీశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజా పరిణామంతో వైసీపీ నేతల మధ్య ఉన్న అంతర్గత విబేధాలు బయటపడుతున్నాయి.

నాలుగేళ్ల కిందట జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో వైసీపీ 58 వార్డులను గెలుచుకోవడంతో పాటు ఇండిపెండెంట్లుగా గెలిచిన నలుగురు కార్పొరేటర్ల మద్దతుతో మేయర్‌గా గొలగాని హరి వెంకటకుమారిని ఎంపిక చేసింది. అప్పటినుంచి జీవీఎంసీలో వైసీపీ నేతల హవాయే నడుస్తూ వచ్చింది. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జీవీఎంసీలో పరిణామాలు శరవేగంగా మారసాగాయి. ఇండిపెండెంట్లుగా గెలిచిన నలుగురిలో ఇద్దరు టీడీపీలోచేరగా, మరో ఇద్దరు జనసేనలో చేరిపోయారు. వైసీపీ నుంచి కార్పొరేటర్లుగా గెలిచిన 27 మంది కూడా టీడీపీ, జనసేన కూటికి చేరారు. దీంతో కౌన్సిల్‌లో కూటమి బలం 63కి చేరగా, వైసీపీ బలం 32కి తగ్గిపోయింది. అదే సమయంలో జీవీఎంసీ పరిధిలోని ఎనిమిది ఎమ్మెల్యే సీట్లు, రెండు ఎంపీ సీట్లను కూటమి పార్టీలే గెలుచుకోవడంతో ఎక్స్ అఫీషియో సభ్యుల హోదాలో 11 స్థానాలు కూటమికి పెరగడంతో గ్రేటర్‌లో కూటమి బలం 74కి పెరిగింది. అంటే మొత్తం 111 మంది సభ్యులు కలిగిన కౌన్సిల్‌లో కూటమికి 2/3 వంతు ఆధిక్యం దక్కినట్టయింది. ఈ మేరకు స్పష్టమైన సంఖ్యాబలం ఉండడంతో కూటమి నేతలు జీవీఎంసీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం కోరుతూ గత నెల 22న జిల్లా కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. దీనిని పరిశీలించిన కలెక్టర్ ఈ నెల 20న మేయర్‌పై అవిశ్వాస తీర్మానం కోసం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. అప్పటికే కూటమికి 72 మంది సభ్యుల బలం ఉండడంతో కేవలం మరో ఇద్దరు సభ్యులు మద్దతు మాత్రమే అవసరం. వైసీపీలో అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లతో పాటు వ్యాపార ప్రయోజనాల కోసం వైసీపీని వీడి కూటమి పార్టీలో చేరే యోచనలో ఉన్న కార్పొరేటర్లు కొందరు ఉన్నారు. దీంతో మరో ఇద్దరు కార్పొరేటర్ల ... మిగతా 6వ పేజీలో



ఏమి హాయిలే ఇలా..

ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతుండడంతో నగరవాసులు ఉక్కపోతతో ఆపసోపాలు పడుతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే భానుడు ప్రతాపం చూపిస్తుండడంతో అత్యవసరమైతే తప్పా బయటకు వచ్చేందుకు సాహసించడం లేదు. ఆదివారం ఉష్ణతాపం మరింత అధికం కావడంతో ఫిషింగ్ హార్బర్ వద్ద సముద్రంలో మత్స్యకార బాలురు స్నానాలు చేస్తూ సేదతీరారు. హార్బర్ వద్ద కెరటాల తీవ్రత ఎక్కువగా ఉండకపోవడంతో పలువురు బాలురు ఉల్లాసంగా.. ఉత్సాహంగా లంగరు వేసిన బోట్లపై నుంచి సాగర జలాలలోకి దూకి ఈత కొడుతూ సరదాగా గడిపారు.

-బీచ్‌రోడ్డు/ఆంధ్రజ్యోతి

బియ్యం కార్డుల్లో ఒడిశా వాసుల పేర్లు

ఆధార్ నంబర్లు సేకరించి కుటుంబ సభ్యులుగా నమోదు

- గోపాలపట్నం, మర్రిపాలెం ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నట్టు అనుమానం
- రేషన్ డీలర్ల సంఘం మాజీ నేత ప్రమేయం
- ఈకేవైసీపై దృష్టిపెడితే బట్టబయలయ్యే అవకాశం
- జిల్లాలో ఇంకా 1,02,076 మంది పెండింగ్
- అందులో ఐదో వంతు నకిలీలు

విశాఖపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):



బియ్యం కార్డులో పేరు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. జిల్లాలో 5.29 లక్షల బియ్యం కార్డుల్లో 15,91,449 మంది సభ్యులు (యూనిట్లు) ఉండగా, ఇప్పటివరకూ 14,89,373 మంది ఈకేవైసీ పూర్తిచేశారు. ఇంకా 1,02,076 మంది పెండింగ్‌లో ఉన్నారు. సగటున రోజుకు 1,000 మంది ఈకేవైసీ పూర్తి చేయగలుతున్నారు. నెలాఖరులోగా మిగిలిన వారంతా పూర్తిచేయాలని పౌర సరఫరాల శాఖ నిర్దేశించింది. అయితే బియ్యం కార్డుల్లో స్థానికేతరుల పేర్లు ఉన్నందున శతశాతం ఈకేవైసీ సాధ్యం కాదని కొందరు రేషన్ డీలర్లు అభిప్రాయపడుతున్నారు. అందుకు తగిన కారణాలు ఉన్నాయని చెబుతున్నారు.

పొరుగు రాష్ట్రం ఒడిశాకు చెందిన వారి పేర్లు (ఆధార్ నంబర్లతో సహా)ను కుటుంబ సభ్యులుగా పేర్కొంటూ కొందరు డీలర్లు బియ్యం కార్డుల్లో చేర్చారు. గోపాలపట్నం, వేపగుంట, మర్రిపాలెం పరిసరాల్లో ఎక్కువగా ఇటువంటి నకిలీ కుటుంబ సభ్యులు ఉన్నారని, నగరంలో మిగిలిన ప్రాంతాల్లో కూడా ఉన్నట్టు డీలర్లు చెబుతున్నారు. రేషన్ డీలర్ల సంఘ నాయకుడిగా పనిచేసిన డీలర్ ఒకరు ఒడిశాకు చెందిన ఆధార్ నంబర్లు సేకరించి ఇక్కడ బియ్యం కార్డుల్లో సభ్యులుగా చేర్పించారని అంటున్నారు. తమ ... మిగతా 6వ పేజీలో



గంధం తొలి విడత అరగదీతకు సన్నాహాలు

సింహాచలం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం పురస్కరించుకుని తొలి విడత గంధం అరగదీతకు దేవస్థానం అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. ఆదివారం ఉదయం ఆలయ పద్మనిధి (భాండాగారం) నుంచి ముందుగా భద్రపరిచిన గంధం చెక్కలను ఈఓ కొమ్ముల సుబ్బారావు సమక్షంలో బయటకు తీశారు. ఈనెల 24న తొలి విడత చందనం అరగదీతకు కావలసిన 32 కిలోల చెక్కలను తూనిక వేసి కార్పెంటర్‌కు అప్పగించారు. సిబ్బంది వాటిని అరగదీతకు అనుకూలంగా అడుగు పొడవు గల ముక్కలుగా కోశారు. అనంతరం వాటిని ఏఈఓ ఆనందకుమార్, స్థానాచార్యులు రాజగోపాల్, ఆలయ పర్యవేక్షణాధికారి ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు పవిత్ర జలధారల జలాల్లో నానబెట్టారు.

95 మందికి హోమియో వైద్య పరీక్షలు

భీమునిపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. చిన్న బజారు డచ్ వీధిలో వున్న ఆ సంస్థ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకూ జరిగిన ఈ శిబిరాన్ని ఆ సంస్థ చైర్మన్ కె. శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు.వైద్యులు జగన్నాథరావు, మోహన్ 95 మంది రోగులను పరీక్షించి, మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు మూర్తి, కె. చంద్రశేఖర్, కేవీ భానోజీరావు, కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ..

... 5వ పేజీ తరువాయి

పడింది. గడిచిన మూడేళ్లలో ప్రభుత్వ యాజమాన్య ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. దీంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 420 ఎస్జీటీ టీచర్లను మిగులుగా చూపిస్తున్నారు. దీనికితోడు టీచర్, విద్యార్థి నిష్పత్తి మేరకు ఖాళీలను భర్తీ చేస్తుండడంతో ఎస్జీటీల నియామకాలను తక్కువగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయంచింది. అయితే గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 117ను రద్దు చేసిన ప్రస్తుత ప్రభుత్వం... కొత్త విధానాలను అమలు చేయనున్నది. ఇందువల్ల మోడల్, బేసిక్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నందున వచ్చే ఏడాదికి పిల్లల చేరికపై కొంత పురోగతి ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత డీఎస్సీలో తక్కువ పోస్టులను మాత్రమే భర్తీ చేస్తున్నందున ఆశావహుల మధ్య తీవ్ర పోటీ ఉంటుందని చెప్పవచ్చు.

ఏజెన్సీలో 400 ఖాళీలు

ఉమ్మడి విశాఖ జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 400 ఖాళీలను భర్తీ చేయనున్నారు.మూడేళ్ల క్రితం వరకు జీవో నంబరు-3 ప్రకారం ఏజెన్సీలో వున్న టీచర్ పోస్టులన్నీ గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేసేవారు. అయితే ఈ జీవోను 2022లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కారణంగా ఐదో షెడ్యూల్‌లో వున్న ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగాలకు గిరిజనులతోపాటు గిరిజనేతరులకు అవకాశం వచ్చింది. గత ఏడాది సాధారణ ఎన్నికల సమయంలో జీవో నంబరు-3 పునరుద్ధరణకు కృషి చేస్తానని విపక్షనేత హోదాలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అన్ని పోస్టులను గిరిజనులతో భర్తీచేయాలని ఆదివాసీ అభ్యర్థులు కోరుతున్నారు.

ఏయూ శతాబ్ది ఉత్సవాలకు సన్నాహాలు

... 5వ పేజీ తరువాయి

నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈనెల 26న ప్రారంభ వేడుకలను ఏయూలోని ఆయా విభాగాల్లో ఘనంగా నిర్వహించనున్నారు. అలాగే ఆదేరోజు ఉదయం వర్సిటీ ప్రాంగణంలో శతాబ్ది వేడుకల బెలూన్స్‌ను ఎగురవేయనున్నారు. అనంతరం కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. ఆ తరువాత సాగర తీరంలో సెంటినరీ వాక్‌థాన్‌ను నిర్వహిస్తారు. సాయంత్రం బీచ్ రోడ్డులోని కన్వెన్షన్ హాల్‌లో శతాబ్ది ఉత్సవాలను చేపడతారు.

పలు కమిటీల నియామకం

శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు వీసీ రాజశేఖర్ పలు కమిటీలను ఏర్పాటు చేశారు. వేడుకలను అట్టహాసంగా నిర్వహించే బాధ్యతను ఆయా కమిటీలు చూసుకుంటాయి. ఇందులో వీసీ జీపీ రాజశేఖర్ నేతృత్వంలోని యూనివర్సిటీ లెవెల్ కోర్ కమిటీ ఒకటి. దీనికి చైర్మన్‌గా వీసీ వ్యవహరిస్తున్నారు. రిజిస్ట్రార్ కన్వీనర్ అండ్ మెంబర్ సెక్రటరీ కాగా, రెక్టార్‌తో పాటు ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీలో చైర్మన్‌తో సహా 14 మంది ఉన్నారు. దీనినే సెంటినరీ సెలబ్రేషన్ కమిటీగా పరిగణిస్తున్నారు. అదేవిధంగా ఈవెంట్స్ మేనేజ్‌మెంట్ కమిటీ, లోగో సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా ఏయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజును నియమించారు. పూర్వ విద్యార్థుల సంబంధాల కమిటీ చైర్మన్‌గా ఏయూ మహిళా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మశ్రీ, డాక్యుమెంటేషన్ అండ్ లెగసీ చైర్మన్‌గా రెక్టార్ ప్రొఫెసర్ ఎన్. కిశోర్‌బాబు,మీడియా రిలేషన్స్ చైర్మన్‌గా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ. నరసింహరావు, ఫండ్ రైజింగ్ కమిటీ చైర్మన్‌గా ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గిరిజా శంకర్‌ను నియమించారు. వీటితో పాటు మరికొన్ని కమిటీలను నియమించినట్టు తెలిసింది.



భీమిలి : పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గంటా



సింహాచలంలో చంద్రబాబు పేరు మీద పూజలు చేస్తున్న నాయకులు

పాలనాదక్షుడు చంద్రబాబునాయుడు

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- నియోజకవర్గంలో ఘనంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

భీమునిపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలు నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా జరిగాయి. భీమిలిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కేక్ కట్ చేశారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గంటా మాటాడుతూ చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ప్రపంచవ్యాప్తంగా వున్న తెలుగువారు పండుగలా జరిపారన్నారు.ఆయన మంచి పాలనాదక్షుడు, రాజనీతిజ్ఞుడు అని కొనియాడారు. ఎన్నికల హామీ మేరకు మహిళలకు త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం పథకం తీసుకువస్తామని చెప్పారు. త్వరలో మధురవాడలో 97 ఎకరాల్లో ఐకానిక సిటీ పేరిట ఆధునాతన సదుపాయాలతో టౌన్ షిప్ అందుబాటులోకి రానున్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు ఈనెల 24న చినజీయరుస్వామి శంకుస్థాపన చేస్తారన్నారు. భోగాపురం విమానాశ్రయం మరో ఏడాదిలో ప్రారంభమవుతుందన్నారు. తర్లువాడలో ఐటీ హబ్ నిర్మాణానికి తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డీఏఎన్ రాజు, గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్, పాసి నరసింగరావు, అక్కరమాని వెంకటరావు, గాడు అప్పలనాయుడు, కొప్పల రమేశ్, మొల్లి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



పద్మనాభంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు

విశాలాక్షినగర్ : జీవీఎంసీ 9వ వార్డు రామాలయం వీధిలో చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో నాయకులు వేజెళ్ల సుబ్బరాజు, వార్డు టీడీపీ అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, వెంసాడ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది : ముఖ్యమంత్రి చంద్రబాబు 75 ఏళ్ల యువ నాయకుడు అని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు గరే గురునాథ్ అన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పీఎంపాలెం వృద్ధాశ్రమంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించి, వృద్ధులకు భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పీఎంపాలెం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆరో వార్డులోని పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సర్వ దేవుళ్లు, షేక్ సుభాణి, నొడగల జానకీ రామ్ పాల్గొన్నారు.

సింహాచలం : చంద్రబాబునాయుడు జన్మదినం పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామికి టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు ఉదయం స్వామివారిని దర్శించుకుని సీఎం గోత్రనామాలతో అంతరాలయంలో పూజలు జరిపించారు. అలాగే 98వ వార్డు కార్పొరేటర్ పిసిని వరాహ నరసింహం సారధ్యంలో బీజేపీ వార్డు అధ్యక్షుడు రచ్చా ఆనంద శ్రీనివాస వర్మ, జనసేన వార్డు అధ్యక్షుడు మజ్జి సూరిబాబు తదితరులు కొండదిగువ తొలిపావంచా వద్ద చంద్రబాబు పేరుతో పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎంకె గోపాల్, గండ్రెడ్డి వెంకటరమణ, రాజనాల సత్యారావు, గుసిడి అవినాష్‌బాబు, సానబోయిన పైడిరాజు, పండూరి మురళీ, పట్నాల దర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభంలోని ఎన్టీఆర్ పార్కులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నాయకులు తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం చంద్రబాబు చిత్రపటంతో తయారు చేసిన కేక్ కట్ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కె. లీలావతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నగేశ్‌కుమార్, నాయకులు విజయబాబు, గంగరాజు, ప్రసాద్, శ్రీరామ్మూర్తి, శ్రీను, అప్పలనాయుడు, సన్యాసిరావు, నరసింగరావు, మహేశ్వరరావు పాల్గొన్నారు.

24న ఐకానిక సిటీ ఆఫ్ గోల్డ్‌కు శంకుస్థాపన

- మొదటి దశలో 180 విల్లాలు
- చైర్మన్ కె. మురళీకృష్ణ, ఎండీ కె. సంతోష్

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రుషికొండ ఐటీ హిల్ నెంబరు 3 సమీపంలో ఉన్న 97 ఎకరాల్లో ఐకానిక సిటీ ఆఫ్ గోల్డ్ పేరుతో టౌన్ షిప్ అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఆ సంస్థ చైర్మన్ కె. మురళీకృష్ణ, ఎండీ కె. సంతోష్ తెలిపారు. ఆదివారం వారు హోటల్ డాల్ఫిన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 24న త్రిదండి చిన్న జీయర్‌స్వామితో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తామని చెప్పారు. మొదటి దశలో 4,500 నుంచి 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల 180 విల్లాలు నిర్మిస్తామన్నారు.కమర్షియల్ కాంప్లెక్స్‌లు, కన్వెన్షన్ సెంటర్, ఫైవ్ స్టార్ హోటల్, ఐటీ టవర్స్, ప్రీమియం అపార్ట్‌మెంట్స్ వంటి నిర్మాణాలు దశల వారీగా వస్తాయని వెల్లడించారు. 45 వేల చదరపు అడుగుల్లో విశాలమైన క్లబ్ హౌస్ కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. విశాఖ, తిరుపతిలో ఫైవ్ స్టార్ హోటళ్లు అందుబాటులోకి తీసుకువస్తామని, రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టాలన్న ఉద్దేశంతో విశాఖలో శ్రీరామ్ ప్రాపర్టీస్ దగ్గర విల్లాల నిర్మాణం చేపట్టామన్నారు. ఎన్‌సీసీకి చెందిన భూమిలో ఐకానిక సిటీ ఆఫ్ గోల్డ్ టౌన్ షిప్ తీసుకువస్తున్నామని వివరించారు. రియల్ ఎస్టేట్ రంగంలో తమకు 25 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉందని, బెంగళూరులో గార్డెన్ సిటీ రియల్టర్స్ పేరుతోను, హైదరాబాద్‌లో సైబర్ సిటీ పేరుతోనూ వేలాది అపార్ట్‌మెంట్‌లు, విల్లాలు విక్రయించామని చెప్పారు. నిర్మాణ రంగంలో ప్రప్రథమంగా గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్ ప్రవేశపెట్టామన్నారు. అనంతరం వారు ఐకానిక సిటీ ఆఫ్ గోల్డ్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ మురళీకృష్ణ, ఎండీ సంతోష్

తాళ్లవలసలో భగవద్గీతపై ప్రచారం

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : తాళ్లవలస గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి సభ్యులు భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. వేదిక అధ్యక్షుడు కె. త్రినాథరావు ఆధ్వర్యంలో సభ్యులు ఇంటింటికి వెళ్లి భగవద్గీత గురించి ప్రజలకు వివరించి, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు సురేశ్, రాజు, భవాని, నరసయ్యమ్మ, సంతోష్, సత్యం పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు

మధురవాడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా మధురవాడ శిల్పారామంలో నగరానికి చెందిన జోష్ డ్యాన్స్ అకాడమీ కళాకారులు ఆదివారం శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో పవిత్ర, మోక్షజ్ఞ, లక్ష్మీప్రణతి, జాస్మిక, గీతామిత్కా, తదితరులు పాల్గొన్నారు.

70 మందికి నేత్ర వైద్య పరీక్షలు

పద్మనాభం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో విశాఖ జోన్ సత్యసాయి సేవా సమితి,స్థానిక భజన మండలి ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్య శాల ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 70 మంది రోగులను పరీక్షించి, 25 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శాంతి, సత్యసాయి సేవా సమితి జోనల్ కోఆర్డినేటర్ ఎంవీ సత్యసాయి కుమార్, భజన మండలి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేయాలి

సాగర్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వేలి రహదారిలో ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేయాలని వాకర్స్ కోరుతున్నారు. జాతీయ రహదారిని, బీచ్ రోడ్డును కలుపుతూ అభివృద్ధి చేసిన ఈ రహదారిపై ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేవారి సంఖ్య ఎక్కువైంది. దీనికితోడు ఈ రహదారిపై వాహనాల రాకపోకలు కూడా అధికమయ్యాయి. రోడ్డులో హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడంతో వాకర్స్ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నడవాల్సి వస్తోంది. డ్రైవింగ్ స్కూళ్లకు చెందిన నిర్వాహకులు కారు డ్రైవింగ్ కూడా ఇదే రోడ్డులో నేర్పిస్తుండ డంతో వాకర్స్ మరింత ఆందోళనకు గురవుతున్నారు.

కత్తితో బెదిరించి గొలుసు అపహరణ

కొమ్మాది, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వికలాంగుల కాలనీలో ఓ వ్యక్తిని దుండగులు కత్తితో బెదిరించి బంగారు గొలుసు అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కొమ్మాది దరి వికలాంగుల కాలనీకి చెందిన త్రినాథరావుకు కిరాణాదుకాణం ఉంది. శనివారం రాత్రి 10 గంటల సమయంలో దుకాణం కడుతుండగా వెనుక నుంచి ఎవరో మెడలో ఉన్న గొలుసు లాగినట్టు అనిపించి వెనుదిరిగి చూసేసరికి దొంగ గొలుసుతో పాటు పరుగు తీశాడు. అతన్ని వెంబడించగా సగం దూరం వెళ్లాక మరో వ్యక్తి కలిసి కత్తితో బెదించారని బాధి తుడు తెలిపాడు. అక్కడి నుంచి ఇద్దరూ బైక్‌పై పారిపోయినట్టు చెప్పాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపారు.

గోస్తనీ తీరంలో పశు వధ

- వారంలో మూడు రోజులు పశువుల సంహారం
- అక్కడే మాంసం వేరు చేసి, నదిలో శుభ్రం
- తుప్పల మధ్య ఎముకల ఆరబోత
- గుట్టుచప్పుడు కాకుండా పని కానిస్తున్న అక్రమార్కులు
- కలుషితమవుతున్న నదీ జలాలు
- దుర్వాసనతో స్థానికుల అవస్థలు



తుప్పల మధ్య ఎండబెట్టిన పశువుల కళేబరాలు

తగరపువలస, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గోస్తనీ నదీ తీరంలో పశువుల వధ యథేచ్ఛగా జరుగుతోంది. వారంలో మూడు రోజుల పాటు అక్రమార్కులు ఇక్కడ పశువులను వధించి, వాటి మాంసాన్ని వేరు చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా ఈ తంతు కొనసాగుతోంది. ప్రతి ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి పది, పన్నెండు పశువులను వధిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతాన్ని పరిశీలిస్తే అనేక పశువుల కళేబరాలు కనిపిస్తున్నాయి. వారంలో ఆది, మంగళ, శుక్రవారం తప్పనిసరిగా ఇక్కడ పశువుల కోత ఉంటోంది. పశువులను వధించి, వాటి మాంసాన్ని నదిలో శుభ్రం చేసి, ఇతర ప్రాంతాలకు తీసుకువెళుతున్నారు. తగరపువలస, చిట్టివలస ప్రాంతాల్లో ఉన్న నదీ తీరంలో 12 ఎకరాల మేర తుప్పలు, డొంకలు ఉన్నాయి. వాటి మధ్యలో పశువులను చంపి మాంసాన్ని వేరు చేస్తున్నారు.అనంతరం అదే చోట దుమ్ములను ఎండబెడుతున్నారు. వీటిని కూడా ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తుంటారని, నెలకు ఒకసారి లారీలో వాటిని లోడ్ చేస్తుంటారని స్థానికులు చెబుతున్నారు.



శిక్షణ పొందడానికి వచ్చిన మహిళలతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కొమ్మాది, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. 5వ వార్డులో బీసీ కార్పొరేషన్ స్వయం ఉపాధి కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణా తరగతులను ఆదివారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతమంది మహిళలు శిక్షణకు వచ్చారని అధికారులను ప్రశ్నించగా 51 మంది ఎంపికయ్యారని, రోజుకు రెండు విడతల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. అధికారుల వద్ద ఉన్న జాబితాను తీసుకుని అక్కడికి వచ్చిన వారి పేర్లు చదివి చెక్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి జాడలేదని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాత అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన చేస్తూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కష్టపడుతున్నారని చెప్పారు.భీమిలి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని, ఎప్పటికప్పుడు అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి, ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నానని తెలిపారు. రాష్ట్రానికి వస్తున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టులన్నీ ఎక్కువ శాతం భీమిలి ప్రాంతంలోనే ఏర్పాటు కానున్నాయన్నారు. అనంతరం 5వ వార్డు టీడీపీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకల్లో పాల్గొని, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, జడ్పీ కనక మహాలక్ష్మి, ఏపీడీ శ్రీరామ్, కార్పొరేటర్ మొల్లి హేమలత, టీడీపీ రాష్ట్ర నాయకుడు మొల్లి లక్ష్మణరావు, వార్డు అధ్యక్షుడు నాగోతి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు, ఈగల రవికుమార్, నమ్మి శ్రీను, కొండపు రాజు, జనసేన నాయకుడు దేవర శివ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణ

... 5వ పేజీ తరువాయి

అందుబాటులో ఉండాలని ఆదేశించామన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా అనేక గ్రామాలకు తాగునీరు అందుతున్నదని, ఇప్పటికే ఉన్న రక్షిత నీటి పథకాల నుంచి ఇంటింటికీ కొళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తున్నామని చెప్పారు.

ఆర్థిక సంఘం నిధులతో 725 పనులు

గత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలివిడత కింద 15వ ఆర్థిక సంఘం ద్వారా జడ్పీకి వచ్చిన రూ.14 కోట్లతో ఉమ్మడి జిల్లాలో రోడ్లు, డ్రైన్లు, బోర్ల మరమ్మతులు వంటి 725 పనులు మంజూరుచేయగా ఇంతవరకు 200కుపైగా పనులు పూర్తిచేసి రూ.ఆరు కోట్ల వరకు బిల్లులు చెల్లించామన్నారు. వాస్తవంగా ఈ పనులు మార్చి నెలాఖరులోగా పూర్తికావల్సి ఉందని, అయితే పలు కారణాల వల్ల కొంత జాప్యం జరిగిందని పేర్కొంటూ జూన్ నెలాఖరుకు పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు ఇంకా విడుదల కావల్సి ఉందన్నారు.

కాగా ఆర్థిక సంఘం నిధుల్లో ఇప్పటివరకు పంచాయతీలకు 70 శాతం, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు 15 శాతం చొప్పున వచ్చేవని, అయితే తాజాగా చేసిన మార్పుల చేసిన మేరకు మండల పరిషత్‌లకు 20 శాతం, జడ్పీలకు 10 శాతం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రహదారులు, ఇతర పనులకు రూ.20 కోట్లు, తాగునీటి పథకాలకు రూ.10 కోట్ల వ్యయానికి పాలనాపరమైన ఆమోదం తెలిపినట్టు సీఈవో పేర్కొన్నారు. సాధారణ నిధులు రూ.20 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వీటికి సంబంధించి ఇంతవరకు రూ.ఏడు కోట్ల విలువైన బిల్లులు సీఎంఎఫ్ఎస్‌కు అప్‌లోడ్ చేశామన్నారు.

అన్ని జడ్పీ హైస్కూళ్లకు ప్రహరీ గోడలు

ఉమ్మడి విశాఖ జిల్లాలో జడ్పీ ఉన్నత పాఠశాలల ఆస్తుల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని జడ్పీ సీఈవో నారాయణ మూర్తి తెలిపారు. ప్రతి పాఠశాల చుట్టూ ప్రహరీగోడ వుండాలనే నిబంధన అమలుచేశామన్నారు. ఇప్పటి వరకు ప్రహరీగోడలు లేని పాఠశాలలకు సమగ్ర శిక్ష, ఉపాధిహామీ పథకం నిధులతో గోడలు నిర్మిస్తామని చెప్పారు. ప్రతి ఉన్నత పాఠశాల ఆస్తులకు సంబంధించి ఆయా మండల తహసీల్దార్ల నుంచి ఫెయిర్ అడంగల్ కాపీలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీపీ పాఠశాలల ఆస్తుల విషయంలో ఆయా మండల పరిషత్ అధికారులకు ఇప్పటికే సూచనలు చేశామని సీఈవో వెల్లడించారు.

అతి విశ్వాసమే కొంపముంచింది..

... 5వ పేజీ తరువాయి

బలం సాధించడం కూటమికి పెద్ద కష్టమేమీ కాదని కూటమి నేతలతో పాటు వైసీపీనేతలు కూడా అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ తమ పార్టీలో ఉన్నవారెవరూ బయటకు వెళ్లరని, పైగా ఇటీవల కూటమి పార్టీల్లో చేరిన వారిలో కొందరు మళ్లీ వెనక్కి వచ్చేస్తారంటూ.. అవిశ్వాసం నెగ్గదని వైసీపీలో కొందరు ముఖ్య నేతలు భ్రమించారు. దీంతో గతనెల 23న కార్పొరేటర్లు, నేతలతో భ్రమలో ఉన్న ముఖ్య నేతలు సమావేశం పెట్టి తమ కార్పొరేటర్లందరినీ క్యాంప్ పేరుతో బెంగళూరు, శ్రీలంక తరలించాలని ఆదేశించారు. ఇందుకోసం అయ్యే ఖర్చును మేయర్, డిప్యూటీ మేయర్లతో పాటు ఫ్లోర్ లీడర్ పెట్టుకోవాలని స్పష్టం చేశారు. అదే సమయంలో ముఖ్య నేతల అభిప్రాయాలపై కొందరు నాయకులు, కార్పొరేటర్లు తమ అభ్యంతరం వ్యక్తం చేస్తూ కౌన్సిల్‌లో కూటమికి స్పష్టమైన మెజారిటీ ఉందని, ఒకరిద్దరిని సంపాదించుకోవడం వారికి పెద్ద ఇబ్బంది కాదని వివరించినట్టు సమాచారం. అంతేకాకుండా తమతోపాటు సమావేశానికి రాని వారిలో కొందరు పార్టీ పట్ల అసంతృప్తితో ఉన్నారని, మరికొందరు వ్యాపార ప్రయోజనాల కోసం పార్టీకి దూరంగా ఉంటూ ఇతర పార్టీల వైపు చూస్తున్నందున వారిలో ఎవరో ఒకరు ఎంత అడ్డుకున్నా కూటమిలో చేరిపోవడం ఖాయమని స్పష్టంగా చెప్పినట్టు తెలిసింది. అయినప్పటికీ ముఖ్య నేతలు మాత్రం అవిశ్వాసం వీగిపోయేలా చేసేందుకు తమ వద్ద కార్యాచరణ ఉందని, మేయర్‌తో స్వచ్ఛందంగా రాజీనామా చేయిస్తే అనవసరంగా రాష్ట్రంలోనే అతిపెద్ద కార్పొరేషన్‌ను కోల్పోయినట్టవుతుందని దబాయించినట్టు సమాచారం. దీంతో వారంతా చేసేది లేక గతనెల 24న క్యాంప్ శిబిరానికి తరలిపోయారు.

తాజా పరిణామంతో మౌనవ్రతం..

మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై కూటమి నేతలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం శనివారం 2/3 వంతు మెజారిటీతో నెగ్గడంతో వైసీపీలో ఆదినుంచి అవిశ్వాస తీర్మానంపై ముందుకు వెళ్లడాన్ని వ్యతిరేకిస్తున్న వారికి అవకాశంగా మారింది. కౌన్సిల్‌లో తమ పార్టీ బలం తగ్గిపోయిందని, కూటమి అవిశ్వాసం పెట్టడంతో ఎలాగైనా మేయర్ పదవిని కోల్పోవలసి వస్తుంది కాబట్టి ప్రత్యేక సమావేశానికి ముందే స్వచ్ఛందంగా రాజీనామా చేస్తే మంచిదని తాము గగ్గోలు పెట్టినా కొందరు నేతలు మొండిగా వ్యవహరించారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బలం లేకపోయినా పదవి కోసం చివరి వరకు వేలాడామన్న అప్రతిష్ఠ ప్రజల్లో మూటగట్టుకోవాల్సి వచ్చిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాకాకుండా అవిశ్వాస తీర్మానం కోసం నోటీసు ఇచ్చిన తర్వాత, కౌన్సిల్ సమావేశం జరగడానికి ముందు స్వచ్ఛందంగా మేయర్ రాజీనామా చేసి ఉంటే ప్రజల్లో సానుభూతి పెరిగేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మొన్నటి వరకు అవిశ్వాసం వీగిపోతుందంటూ ఊహల్లో ఊరేగుతూ గొంతు చించుకుని స్టేట్‌మెంట్లు ఇచ్చిన నేతలు ఇప్పుడు మౌనం దాల్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కార్పొరేటర్లను పశువుల్లా కొనుగోలు చేశారంటూ ఎదురుదాడి చేసే ప్రయత్నం చేసినా ప్రజలు హర్షించే పరిస్థితి లేదని పేర్కొంటున్నారు.

బియ్యం కార్డుల్లో ఒడిశా వాసుల పేర్లు

... 5వ పేజీ తరువాయి

బంధువులు, స్నేహితులతో పాటు బాగా నమ్మకస్తులైన కార్డుదారులను ఎంపిక చేసుకుని ఒడిశా ఆధార్ నంబర్లతో పలువురి పేర్లను నమోదు చేయించారని ప్రచారం సాగుతుంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో బియ్యం కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం ఇచ్చినప్పుడు కొందరు డీలర్లు అప్పటి పౌర సరఫరాల శాఖ సిబ్బంది సహకారంతో ఈ తప్పుడు వ్యవహారానికి పాల్పడినట్టు చెబుతున్నారు. గోపాలపట్నం, వేపగుంటలో ఒక డీలర్ పరిధిలో ఎక్కువగా ఐదారుగురు కుటుంబ సభ్యులున్న కార్డులు ఉన్నాయి. ఈ విధంగా నెలకు టన్ను బియ్యం పక్కదారి పట్టిస్తున్నారని అంటున్నారు. ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న 1,02,076 మందిలో ఐదో వంతు నకిలీలు ఉండే అవకాశం ఉందని మర్రిపాలెం ప్రాంతానికి చెందిన కొందరు డీలర్లు అంటున్నారు. అలాగే చనిపోయిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి పేర్లను కార్డుల నుంచి తొలగించకుండా కొంతమంది ఐదు కిలోల వంతున బియ్యం తీసుకుంటున్నారు. ఏదేమైనా నెలాఖరులోగా ఈకేవైసీ పూర్తయ్యేలా చూడాలని ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న వారి వివరాలను ప్రతి డీలర్‌కు పౌర సరఫరాల శాఖ అందజేసింది. డీలర్లు కార్డుదారుడికి ఫోన్ చేసి ఈకేవైసీ చేయాలని కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతం కంటే నగరంలో ఈకేవైసీ పూర్తి చేయాల్సిన వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంది.


వెంకోజీపాలెం : 15వ వార్డులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేత మళ్ల అప్పలరాజు, మళ్ల రవికుమార్ తదితరులు


ఆరిలోవ : 12వ వార్డులో నిర్వ హించిన వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నేతలు ఒమ్మి సన్యాసిరావు, గోపి, ఇ.సన్యాసిరావు తదితరులు


పెదవాల్తేర్ : హిడెన్ స్ప్రౌట్స్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నేతలు పట్టాభి రామ్, పోతన్న రెడ్డి తదితరులు

ఘనంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

» టీడీపీ నేతలు, కార్యకర్తల ఆధ్వర్యంలో వేడుకలు » పలు చోట్ల సేవా కార్యక్రమాలు » పార్టీ కార్యాలయాల్లో పండుగ వాతావరణం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు జన్మదిన వేడుకలను తూర్పు నియోజకవర్గం పరిధిలో పలు ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కార్యాలయం వద్ద ఆయన కుమారుడు వెలగపూడి ప్రతాప్ ముఖ్య అతిథిగా పాల్గొని కేకు కట్ చేశారు. జీవీఎంసీ 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలారావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీ నాలుగో సెక్టరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వెలగపూడి ప్రతాప్ పాల్గొన్నారు. నాయకులు కాళ్ల ంకర్, వివిధ వార్డుల నాయకులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : వాడవాడలా ఆదివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 16వ వార్డులోని రెల్లివీధిలో చంద్రబాబునాయుడు చిన్నారులకు బిస్కెట్లు, మహిళలు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ముందు చంద్రబాబు జన్మదిన కేక్‌ను కట్‌చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దబడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు నారు గోపి, ముగడ వాసు, తూర్పు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు పల్లా ఉమారాణి, మొల్లి శంకర్, జి.అప్పన్న, నూకరాజు, బంగారాజు, మొల్లి శోభ తదతరులు పాల్గొన్నారు.

అలాగే 15వ వార్డు పాత వెంకోజీపాలెం జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మజ్జిగ పంపిణీ చేశారు. ముందుగా చంద్రబాబు జన్మదిన కేక్‌ను కట్ చేసి అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, జనసేన నాయకులు పీల వెంకట పరదేశినాయుడు, శ్రీసీతారామ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు మళ్ల పోలిరాజు, అధ్యక్షుడు కర్రి వెంకట సూరిఅప్పారావు, ఉపాధ్యక్షుడు పెంటకోట ప్రకాష్, పొలమరశెట్టి శంకరరావు, శరగడం సుధాకర్, కర్రి రవి, కాళ్ల రాజేష్, పీల పెద్ద, రాజగిరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో నిర్వహించిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, టీడీపీ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, పార్లమెంటరీ నాయకులు ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, గోపి, తెలుగు మహిళా నేతలు పాల్గొన్నారు. అలాగే 13వ వార్డులో పాత్రకండ ధర్మారావు, 11వ వార్డులో టీడీపీ వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు ఆధ్వర్యంలో ఆరిలోవ దుర్గాలమ్మ గుడి జంక్షన్‌లో గల ఎన్టీఆర్ విగ్రం వద్ద కేకును కట్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కృష్ణంరాజు, మూది అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే 10వ వార్డులో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజశేఖర్ ఆధ్వర్యంలో 20 కిలోల కేకును కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి మద్దిల రాజశేఖర్, పార్టీ వార్డు టిడిపి అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు పాల్గొన్నారు. ఆరిలోవలో గల ఉపకార్ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో కంచెర్ల ఆతీయ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కంచెర్ల అచ్యుతరావు ఆధ్వర్యంలో 75 కిలోల భారీ కేకుకు కట్ చేశారు.

పెదవాల్తేర్‌లో..

పెదవాల్తేరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను జీవీఎంసీ 22వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పీతల అమరేంద్ర, నాయకుడు అవినాశ్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్ రుద్ర పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు నాయుకులు పీతల అవినాష్ యాదవ్, మూర్తి యాదవ్, చిన్ని, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల పాఠశాలలో..

స్థానిక హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్, టీడీపీ నాయ కుడు బైరెడ్డి పోతన్న రెడ్డి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక దివ్యాంగుల మధ్య కేక్ కట్ చేసి మిఠాయిలు, చాక్లెట్స్, బిస్కెట్లు పంచారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బైరెడ్డి పోతన్నరెడ్డి, నెకంటి సత్తిబాబు, సఅహెచ్ జ్యోతి, నరేంద్ర, మానసిక దివ్యాంగుల పాఠశాల నిర్వాహకుడు కండిపిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రామ్‌నగర్‌లో..

రామ్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రామ్‌నగర్ జీవీఎంసీ జంక్షన్‌లోని 28వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి నక్కా కనకరాజు ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కుమారుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


వెంకోజీపాలెం : 16వ వార్డులోని రెల్లి వీధిలో చంద్రబాబు జన్మదిన వేడుకల సందడి


ఆరిలోవ : 12వ వార్డులో నిర్వ హించిన వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నేతలు ఒమ్మి సన్యాసిరావు, గోపి, ఇ.సన్యాసిరావు తదితరులు


రామ్‌నగర్ : 28వ వార్డులో నక్కా కనకరాజు ఆధ్వర్యలో నిర్వహిసున్న వేడుకలు

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో డీఆర్ఎం తనిఖీలు


ప్రయాణికులతో మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రైలులో ప్రయాణికుల సౌకర్యాల నిర్వహణపై డీఆర్ఎం లలిత్ బొహ్రా ఆదివారం తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించి రైల్లో ప్రయాణికులకు కల్పించిన సదుపాయాలు, వాటి నిర్వహణ తీరుపై ఆరా తీశారు. అలాగే ప్యాంటీకార్‌లోకి వెళ్లి ఆహార పదార్థాల ప్రమాణాలను తనిఖీ చేశారు. ప్రయాణికులకు అమ్మకాలు చేపడుతున్న ఆహార పదార్థాలు నాణ్యతను పరిశీలించారు. ఇక ప్యాంటీ కార్‌లో పాటిస్తున్న భద్రతా ప్రమాణాలు, నిల్వ సరుకుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు.

అనంతరం కోచ్‌ల్లోకి వెళ్లి ప్రయాణికులతో మాట్లాడి సదుపాయాల నిర్వహణపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. మల విసర్జన, మూత్ర విసర్జన బహిరంగ ప్రదేశాల్లో చేయడం, ట్రాక్‌లు దాడడం, అత్యవసర చైన్ లాగడం వంటివి దుర్వినియోగం చేయవద్దని సూచించారు. ఇక ప్రయాణ సమయంలో తమ వస్తువుల భద్రతపై అప్రమత్తంగా వ్యవహరించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైలులో అనుమానస్పద వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే టోల్ ఫ్రీ నంబరు 139కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని సూచించారు.

ఘనంగా ఏఐబీఈఏ వార్షికోత్సవం


విజేతలకు బహుమతులు అందచేస్తున్న ఏఐబీఈఏ నాయకుడు వసంతరావు

సీతమ్మధార, ఏప్రిల్ 20, (ఆంధ్రజ్యోతి) : బ్యాంక్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కృషి చేస్తుందని, ఏఐబీఈఏ యూనియన్ ఇప్పటి వరకు ఎన్నో బ్యాంక్ ఉద్యోగుల సమస్యలపై పోరాడుతూ యాజమాన్యంతో ఉద్యోగస్తులను సమన్వయపరుస్తూ సమస్యలు పరిష్కరిస్తుందని జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం కార్యదర్శి ఆర్.వసంతరావు పేర్కొన్నారు. విశాఖపట్నం జిల్లా బ్యాంక్ ఉద్యోగి సమన్వయ సంఘం ఆధ్వర్యంలో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 80వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను పంజాబ్ నేషనల్ బ్యాంక్ వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా జెండాను ఎగురవేసి, ఏఐబీఈఏ రూపకర్తలు ప్రభాత్కర్, పర్వానా, తారకేశ్వర్ చక్రవర్తి, చెడ్డా గార్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఉద్యోగులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోటేశ్వరరావు, సాత్యకి ప్రసాద్, శంకర్ రాఉ, వసంతరావు, ఈత ప్రసాద్, ఆడాని శ్రీను, ఈశ్వర్, రమేష్, గురుమూర్తి, రవి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఇది శుభపరిణామం

మేయర్‌పై అవిశ్వాసం నెగ్గడంపై జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ మూర్తి యాదవ్

సీతంపేట, ఏప్రిల్ 20, (ఆంధ్రజ్యోలి) : విశాఖ వాసులు, విశాఖపట్నం అంతా కలిసి చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారని, జీవీఎంసీలో తొలిసారి కూటమి మేయర్ పాలన కావాలని కోరుకున్నారని, ప్రజాస్వామ్యంగా చట్టబద్దంగా రాజ్యాంగబద్దంగా కూటమి విజయం సాధించిందని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ పేర్కొన్నారు. ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మూర్తియాదవ్ మాట్లాడుతూ జగన్ అరాచక పాలన పోయి తొమ్మిది నెలలు అయిన తర్వాత సరికొత్త అభివృద్ధి జీవీఎంసీలో రావడానికి పురుడు పోసుకుందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు కానుకగా జీవీఎంసీ గెలుపును ఇస్తున్నామన్నారు. మేము ఏ ఒక్క వైసీపీ కార్పొరేటర్‌ను ప్రలోభ పెట్టలేదని, భయ పెట్టలేదన్నారు. వైసీపీ మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు అవినీతికి పాల్పడడం వల్లే అవిశ్వాస తీర్మానం పెట్టి గెలిచామన్నారు.

ఈ సమావేశంలో బీజేపీ ఫ్లోర్‌లీడర్ గంకల కవిత, టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, భూపతిరాజు సుజాత తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై నిరుద్యోగుల హర్షం

» సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల నిరుద్యోగులు హర్షం వ్యక్తంచేశారు. ఆదివారం వారు ద్వారకానగర్‌లోని వినెక్స్ శిక్షణ కేంద్రంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నిరుద్యోగ అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం ఎంతోమేలు చేకూర్చేలా నిర్ణయం తీసుకుందన్నారు. శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న తమ ఆశలను ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఏయూలోని వీఎస్ కృష్ణా లైబ్రరీ వద్ద కూడా డీఎస్సీ అభ్యర్థులు చంద్రబాబునాయుడు, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అలాగే ఏయూలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆరేటి మహేష్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత సంబరాలు నిర్వహించారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.


సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నిరుద్యోగులు

నిరుద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో..

విశాఖపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఏడేళ్ల నిరీక్షణకు తెరపడుతూ ప్రస్తుత ప్రభుత్వం డీఎస్సీ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేయడం హర్షణీయమని ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీ ఆవరణలో సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన సీఎం చంద్రబాబు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. గత ఏడాది డీఎస్సీలో దరఖాస్తుతో పాటు కట్టిన రుసుంను ప్రస్తుత డీఎస్సీకి వర్తింపజేయాలని కోరారు. డీఎస్సీ పరీక్షలను ఆన్‌లైన్ కాకుండా ఆఫ్‌లైన్‌లో, అన్ని కేటగిరీలకు కలిపి ఒకే రోజు పరీక్ష నిర్వహించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు


డాక్టర్‌ను సత్కరిస్తున్న మహిళలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : భానునగర్ సీయోను మందిరంలో ఈస్టర్‌ను పురస్కరించుకుని పాస్టర్ వంక శివశంకర్ లాజరస్ ఆధ్వర్యాన ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కొండవాలు ప్రాంతంలోనూ చర్చి చుట్టుప్రక్కల ప్రాంతాలలోనూ చర్చి సభ్యులంతా కలిసి యేసు గొప్ప తనాన్ని తెలియజేస్తూ ప్రచారం నిర్వహించారు. పండుగ రోజున సాధారణంగా చర్చిలో ప్రార్థనలు నిర్వహించడం సర్వసాధారణం కానీ దీనికి భిన్నంగా ఈ చర్చి సభ్యులంతా పలు ప్రాంతాలలో పర్యటించి, యేసు పాటలను ఆలపిస్తూ, ఆయన గొప్ప తనాన్ని తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం చర్చిలో జరిగిన కార్యక్రమంలో కళా ఆసుపత్రి ఎండీ డాక్టర్ రమణమూర్తి పాల్గొని యేసు గొప్పతనాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా చర్చిలోని మహిళలంతా డాక్టర్‌కు ఘనంగా సత్కరించి, ద్రాక్షపండ్లు బహూకరించారు.

రామ్‌నగర్‌లో..

రామ్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : దేవుడి ప్రేమ గొప్పదని రెవరెంట్ ఫీబా ఇండియా నేషనల్ డైరెక్టర్ సీఏ బెంజమన్ అన్నారు. ఆదివారం వైఎంసీఏ ఆధ్వర్యంలోని దసపల్లా హిల్స్‌లో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన ప్రార్థనలు నిర్వహించి ఏసు ప్రభువు చేసిన త్యాగాల గురించి వివరించారు. గౌరవ అధ్యక్షుడు రెవరెంట్ స్టీవెన్ పీటర్ ముగింపు ప్రార్థన చేశారు. ఈ వేడుకల్లో మాజీ అధ్యక్షుడు రోనాల్డ్ విలియమ్స్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బెత్సి విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.

జూకు రూ.2.31 లక్షల ఆదాయం

ఆరిలోవ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా సుమారు 2,680 మంది సందర్శకులు వచ్చినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. వీరి ద్వారా జూకు రూ.2.31ల ఆదాయం సమకూరినట్టు ఆమె వెల్లడించారు.

సినిమా గైడ్

● **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)

● **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)

● **జాక్ :** రమాదేవి

● **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 16, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 24, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 32, బీరకాయలు 38, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 14, క్యారెట్ 34 దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 54, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 24, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38 చిలగడ దుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ఆరిలోవ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 9వ వారులోని సంజయ్‌గాంధీ కాలనీలో ఫుట్ పాత్‌లను ఆక్రమించి పలు వెల్డింగ్ పనులు నిర్వహిస్తున్న దుకాణాలను జీవీఎంసీ సిబ్బంది శనివారం తొలగించారు.. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి పనులు చేయడం వల్ల పాదచారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వారికి నడిచేందుకు అవకాశం లేకుండా పోతోంది. దీంతో రోడ్డుపై నడచి వెళ్లడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై ఫిర్యాదులు అందడంతో జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు.అలాగే ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఇలా వ్యాపారాలు సాగిస్తే ట్రేడ్ లైసెన్సులను రద్దు చేస్తామని జీవీఎంసీ 9వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నారాలు హెచ్చరించారు. అక్కడ ఉన్న వెల్డింగ్ మిషన్లను తొలగించారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

వెంకోజీపాలెం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట అంబేడ్కర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం రాష్ట్ర పశుసంవర్థక శాఖ మాజీ డైరెక్టర్ కనక సుందరరావు, మాజీ ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు, ఆయన గొప్పతనాన్ని వివరించారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఆయన చేసి కృషి ఎన్నలేనిదని, నేటి యువత అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాలకు నెరవేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్.కృష్ణచైతన్య, కొల్లబత్తుల సత్యం, కాలనీ సంఘం అధ్యక్షులు గొర్ల రమేష్, కార్యదర్శి కంచుమూర్తి నరసింగరావు, పాలకవర్గ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కనక సుందరరావు, మొల్లి అప్పారావు

25న చౌర్య పాఠం విడుదల


'చౌర్యపాఠం' చిత్ర యూనిట్ బృందం

సిరిపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : దొంగతనం చేయడం వలన ఎదురయ్యే పరిణామాలను హాస్యభరితంగా వివరించే క్రమంలో నిర్మించిన చిత్రం 'చౌర్యపాఠం' అని చిత్ర దర్శకుడు నిఖిల్ గొల్లమారి అన్నారు. ఆదివారం నగరంలోని ఒక గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోయూనిట్ సభ్యులు పాల్గొని మాట్లాడారు. దర్శకుడు నిఖిల్ మాట్లాడుతూ తమ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్నారు. చిత్ర నిర్మాత త్రినాధరావు నక్కిన మాట్లాడుతూ తాను గతంలో ధమాకా చిత్రానికి ఇతర చిత్రాలకు దర్శకుడుగా పనిచేశానన్నారు.అయితే ఈసారి దర్శక బాధ్యతలను నిఖిల్‌కు అప్పగించి తాను నిర్మాతగా వ్యవహరిస్తున్నానన్నారు.హీరో ఇంద్రరామ్ మాట్లాడుతూ టన్నెల్ (సొరంగం)లో దొంగతనం ఎపిసోడ్‌తో వినూత్నంగా హాస్యభరితంగా చిత్రం రూపొందించామన్నారు.హీరోయిన్ పాయల్ రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ చిత్రంలో బ్యాంకు ఉద్యోగిగా పనిచేసే తాను దొంగల ముఠాలో అనుకోకుండా చేరిన సభ్యురాలి పాత్ర ఎంతో వైవిద్యంగా ఉంటుందన్నారు.రాజీవ్ కనకాల మాట్లాడుతూ చౌర్యపాఠం చిత్రంలో తన పాత్ర గతంలోనిపాత్ర కంటే విభిన్నంగా ఉంటుందున్నారు. రాప్ సింగ్ రోల్‌రిడా మాట్లాడుతూ హుషారుగా సాగే పాట ఇప్పటికే మంచి ప్రాచుర్యం పొందిందన్నారు.

లాడ్జీల్లో తనిఖీలు

ఆరిలోవ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కమీషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఆరిలోవ పోలీసు స్టేషన్ పరిధిలో 17 లాడ్జీలను శనివారం అర్ధరాత్రి తనిఖీ చేసినట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశామని చెప్పారు.సాగర్‌నగర్, రుషికొండ, సిగర్‌నగర్, విశాలాక్షినగర్, పెదగదిలి, ముడసర్లోవ ప్రాంతాల్లో ఉన్న లాడ్జీలలో తనిఖీలు చేసినట్టు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్సైలు రామదాసు, కృష్ణ బృందాలు పాల్గొన్నాయని తెలిపారు.

కనబడుట లేదు



పేరు: సోము కామేష్
వయస్సు: 35 సంవత్సరాలు
కలర్ : ఎరుపు
ఎత్తు : 5 అడుగుల 5 అంగుళాలు
ధరించిన దుస్తులు :గ్రీన్ బ్లాక్ కలర్ చెక్స్ షర్ట్, సిమెంట్ కలర్ జీన్‌ఫ్యాంట్
మొబైల్: కీప్యాడ్ మొబైల్, 9959926344
గుర్తింపు: ఎడమకాలు కొంచెం వంగి ఉంటుంది. తలపై చిన్న వెంట్రుకలతో పాటు ఐబ్రోస్‌పై అడ్డంగా ఒక అంగుళం స్క్రాచ్ ఉంటుంది.
సంప్రదించాల్సిన నెంబర్లు: 8019100281, 8790067784, 9346443422, 9603028439

CLASSIFIEDS

LOST OF DOCUMENT

I, DHAVALESWARAPU VIJAYA LAKHSMI, W/o. D. Srinivasa Rao, R/o. D.No.5-12, MIG-A-12, Sagar Nagar, Visakhapatnam. I have lost my Property Sale Deed No.1060/2008 while I was travelling near APEPDCL Office at Madhurawada on 20-11-2024. If anybody found please contact me.

8977651622, 7989359332

సర్టిఫికెట్ పోయినది

దల్లి హేమరెడ్డి, D/o. దల్లి శ్రీనివాసరెడ్డి, గ్రీన్ గార్డెన్స్, మర్రిపాలెం విశాఖపట్నం, అను నేను తేది.10-04-2025న మర్రిపాలెం నుండి ఎన్ఏడి బస్టాప్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో నా టెన్త్ క్లాస్ ఒరిజినల్ సర్టిఫికెట్ పోయినది ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

Cell: 7569543926

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact : 9963231176, 9966165093


అక్కయ్యపాలెంలో నిర్వహించిన వేడుకలో పాల్గొన్న టీడీపీ నేతలు


జ్ఞానాపురంలో చీరలు అందజేస్తున్న సీతంరాజు సుధాకర్ తదితరులు


కంచరపాలెం : చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న వెల్లంకి భరత్

పండుగలా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

» ఉత్సాహంగా పాల్గొన్న టీడీపీ నేతలు, కార్యకర్తలు » పలు చోట్ల కేక్ కటింగ్స్, సేవా కార్యక్రమాలు » చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి అంటూ పలువురి ప్రశంస

మహారాణిపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : నగర టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గండి బాబ్జి మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు కోసం ఆలోచించే గొప్ప దార్శినికుడు చంద్రబాబు అని, 75 ఏళ్ల వయస్సులో కూడా యువకుడిలా పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, దువ్వారపు రామారావు, కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు, కోరాడ రాజబాబు, భరత్, లోడగల కృష్ణ, తోట రత్నం, గనగళ్ల సత్య, కేదారి లక్ష్మి, అనంతలక్ష్మి, సుజాత, నడగట్ల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న గండి బాబ్జి, ఎమ్మెల్సీలు చిరంజీవిరావు, దువ్వారపు రామారావు పాల్గొన్న పలువురు నాయకులు, తెలుగు మహిళా నేతలు

అక్కయ్యపాలెంలో..

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదినోత్సవ వేడుకలు ఆయా వార్డుల్లో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గ్రేటర్ 42వ వార్డులో విశాఖ పార్లమెంటరీ టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అకిరెడ్డి జగదీష్, వార్డు అధ్యక్షుడు కన్నం వెంకట రమణారావు, ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ కేక్ కోసి పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముప్పాళ్ళ శ్రీకృష్ణ, దువ్వి కాళీ ప్రసాద్, జనపాల కృష్ణ, పిలక శ్రీదేవి, కుప్పిలి కుంతీదేవి, గట్టు సీత, బంగారు నవీన్, వేణు, సీహెచ్ రమణమ్మ, మంజుల తాతారావు, తవిటయ్య పాల్గొన్నారు.

45వ వార్డులో..

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రేటర్ 45వ వార్డు అధ్యక్షుడు భరణికాన రాజు ఆధ్వర్యంలో మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ పైలా ముత్యాలనాయుడు కేక్ కోశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హనోక్, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానాపురంలో..

జ్ఞానాపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో ఆదివారం సీఎం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ హాజరై పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొయ్య ప్రసాద్‌రెడ్డి, వార్డు అధ్యక్షుడు ఐతి మధుబాబు, రవిబాబు, జనసేన నాయకులు బాలాజీరావు, గవర రమణ తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 55 వార్డులో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాత ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఉత్తర టీడీపీ నాయకుడు వెల్లంకి భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే స్థానిక చిల్డ్రన్ గ్రోత్ చారిటబుల్ ట్రస్టులో వేడుకలు నిర్వహించారు. చిన్నారులుతో కేక్‌ను కట్ చేయించి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పిల్లలకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతమ్మధారలో..

సీతమ్మధార, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 14వ వార్డులో నిర్వహించిన వేడుకల్లో టీడీపీ వార్డు అధ్యక్షుడు గొంప ధర్మరావు, పార్టీ నాయకుడు పీవీ వసంతరావు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీతంపేటలో..

సీతంపేట, ఏప్రిల్ 20, (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేట గణేష్ నగర్‌లో వార్డు టీడీపీ అధ్యక్షుడు నమ్మి రవికుమార్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డి. నజీర్, వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఇసరపు వెంకటలక్ష్మి, నేతలు ఇసరపు వాసు, లొట్ల పార్వతి, నక్క పద్మ, గంట్యాడ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐబీఈఏ వార్షికోత్సవం



సీతమ్మధార, ఏప్రిల్ 20, (ఆంధ్రజ్యోతి) : బ్యాంక్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కృషి చేస్తుందని, ఏఐబీఈఏ యూనియన్ ఇప్పటి వరకు ఎన్నో బ్యాంక్ ఉద్యోగుల సమస్యలపై పోరాడుతూ యాజమాన్యంతో ఉద్యోగుస్తులను సమన్వయ పరుస్తూ సమస్యలు పరిష్కరిస్తుందని జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం కార్యదర్శి ఆర్.వసంతరావు పేర్కొన్నారు. విశాఖపట్నం జిల్లా బ్యాంక్ ఉద్యోగి సమన్వయ సంఘం ఆధ్వర్యంలో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 80వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను పంజాబ్ నేషనల్ బ్యాంక్ వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోటేశ్వరరావు, సాత్యకి ప్రసాద్, శంకర్ రాఊ, వసంతరావు, ఈత ప్రసాద్, ఆడాని శ్రీను, ఈశ్వర్, రమేష్, గురుమూర్తి, రవి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అతి విశ్వాసమే కొంపముంచింది..

... 5వ పేజీ తరువాయి

బలం సాధించడం కూటమికి పెద్ద కష్టమేమీ కాదని కూటమి నేతలతో పాటు వైసీపీ నేతలు కూడా అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ తమ పార్టీలో ఉన్నవారెవరూ బయటకు వెళ్లరని, పైగా ఇటీవల కూటమి పార్టీల్లో చేరిన వారిలో కొందరు మళ్లీ వెనక్కి వచ్చేస్తారంటూ.. అవిశ్వాసం నెగ్గదని వైసీపీలో కొందరు ముఖ్య నేతలు భ్రమించారు. దీంతో గతనెల 23న కార్పొరేటర్లు, నేతలతో భ్రమలో ఉన్న ముఖ్య నేతలు సమావేశం పెట్టి తమ కార్పొరేటర్లందరినీ క్యాంప్ పేరుతో బెంగళూరు, శ్రీలంక తరలించాలని ఆదేశించారు. ఇందుకోసం అయ్యే ఖర్చును మేయర్, డిప్యూటీ మేయర్లతో పాటు ఫ్లోర్ లీడర్ పెట్టుకోవాలని స్పష్టం చేశారు. అదే సమయంలో ముఖ్య నేతల అభిప్రాయాలపై కొందరు నాయకులు, కార్పొరేటర్లు తమ అభ్యంతరం వ్యక్తం చేస్తూ కౌన్సిల్‌లో కూటమికి స్పష్టమైన మెజారిటీ ఉందని, ఒకరిద్దరిని సంపాదించుకోవడం వారికి పెద్ద ఇబ్బంది కాదని వివరించినట్టు సమాచారం. అంతేకాకుండా తమతోపాటు సమావేశానికి రాని వారిలో కొందరు పార్టీ పట్ల అసంతృప్తితో ఉన్నారని, మరికొందరు వ్యాపార ప్రయోజనాల కోసం పార్టీకి దూరంగా ఉంటూ ఇతర పార్టీల వైపు చూస్తున్నందున వారిలో ఎవరో ఒకరు ఎంత అడ్డుకున్నా కూటమిలో చేరిపోవడం ఖాయమని స్పష్టంగా చెప్పినట్టు తెలిసింది. అయినప్పటికీ ముఖ్య నేతలు మాత్రం అవిశ్వాసం వీగిపోయేలా చేసేందుకు తమ వద్ద కార్యాచరణ ఉందని, మేయర్‌తో స్వచ్ఛందంగా రాజీనామా చేయిస్తే అనవసరంగా రాష్ట్రంలోనే అతిపెద్ద కార్పొరేషన్‌ను కోల్పోయినట్టవుతుందని దబాయించినట్టు సమాచారం. దీంతో వారంతా చేసేది లేక గతనెల 24న క్యాంప్ శిబిరానికి తరలిపోయారు.

తాజా పరిణామంతో మౌనవ్రతం..

మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై కూటమి నేతలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం శనివారం 2/3 వంతు మెజారిటీతో నెగ్గడంతో వైసీపీలో ఆదినుంచి అవిశ్వాస తీర్మానంపై ముందుకు వెళ్లడాన్ని వ్యతిరేకిస్తున్న వారికి అవకాశంగా మారింది. కౌన్సిల్‌లో తమ పార్టీ బలం తగ్గిపోయిందని, కూటమి అవిశ్వాసం పెట్టడంతో ఎలాగైనా మేయర్ పదవిని కోల్పోవలసి వస్తుంది కాబట్టి ప్రత్యేక సమావేశానికి ముందే స్వచ్ఛందంగా రాజీనామా చేస్తే మంచిదని తాము గగ్గోలు పెట్టినా కొందరు నేతలు మొండిగా వ్యవహరించారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బలం లేకపోయినా పదవి కోసం చివరి వరకు వేలాడామన్న అప్రతిష్ట ప్రజల్లో మూటగట్టుకోవాల్సి వచ్చిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాకాకుండా అవిశ్వాస తీర్మానం కోసం నోటీసు ఇచ్చిన తర్వాత, కౌన్సిల్ సమావేశం జరగడానికి ముందు స్వచ్ఛందంగా మేయర్ రాజీనామా చేసి ఉంటే ప్రజల్లో సానుభూతి పెరిగేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మొన్నటి వరకు అవిశ్వాసం వీగిపోతుందంటూ ఊహల్లో ఊరేగుతూ గొంతు చీల్చుకుని స్టేట్‌మెంట్లు ఇచ్చిన నేతలు ఇప్పుడు మౌనం దాల్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కార్పొరేటర్లను పశువుల్లా కొనుగోలు చేశారంటూ ఎదురుదాడి చేసే ప్రయత్నం చేసినా ప్రజలు హర్షించే పరిస్థితి లేదని పేర్కొంటున్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

సీతంపేట, ఏప్రిల్ 20, (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీసు స్టేషన్, ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలో గల రౌడీ షీటర్లకు పోలీసులు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఇప్పటికే రౌడీ షీట్ పొందిన వారు చిన్న పొరపాటుకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తప్పవని, వారు అసాంఘిక కార్యకలపాలు, గొడవలకు దూరంగా ఉండాలని ఎస్ఐలు శ్రీనివాస్, చిన్నంనాయుడు స్పష్టం చేశారు.


సమాధుల దగ్గర ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

వాల్తేర్ సెమిత్రీలో ఈస్టర్ ఆరాధన

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పాత జైలు రోడ్డులోని సెమిత్రీలో క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.సెమిత్రీ అధ్యక్షుడు జార్జ్ చీడి, సెక్రటరీ డా. జి. మాథ్యూ పీటర్, కోశాధికారి థామస్ పుల్లెట్ ప్రార్థనలతో ఆరాధనను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు వారి ఆత్మీయుల సమాధులను పూలతో అలంకరించి, ప్రార్థనలు జరిపారు. అనంతరం బీజెడ్ లూథరన్ చర్చి క్వాయిర్ క్రైస్తవ భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భగవద్గీతకు యునెస్కో గుర్తింపు పట్ల హర్షం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత ఆవిర్భవించి కొన్ని వేల సంవత్సరాలు గడుస్తున్నా, ఇప్పటికీ దాని శోభ చెక్కు చెదరలేదని గీతా ప్రచార సమితి ప్రతినిధి, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భగవద్గీతకు యునెస్కోలో ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ఒక్క మన దేశంలోనే కాకుండా ప్రపంచ దేశాలన్నీ విశ్వసిస్తున్న అత్యున్నతమైన కావ్యం భగవద్గీతేనని చెప్పారు. దేశంలో ఎన్నో ఏళ్లుగా న్యాయస్థానంలో భగవద్గీత కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

గంధం తొలి విడత అరగదీతకు సన్నాహాలు

సింహాచలం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం పురస్కరించుకుని తొలి విడత గంధం అరగదీతకు దేవస్థానం అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. ఆదివారం ఉదయం ఆలయ పద్మనిధి (భాండాగారం) నుంచి ముందుగా భద్రపరిచిన గంధం చెక్కలను ఈఓ కొమ్ముల సుబ్బారావు సమక్షంలో బయటకు తీశారు. ఈనెల 24న తొలి విడత చందనం అరగదీతకు కావలసిన 32 కిలోల చెక్కలను తూనిక వేసి కార్పెంటర్‌కు అప్పగించారు. సిబ్బంది వాటిని అరగదీతకు అనుకూలంగా అడుగు పొడవు గల ముక్కలుగా కోశారు. అనంతరం వాటిని ఏఈఓ ఆనందకుమార్, స్థానాచార్యులు రాజగోపాల్, ఆలయ పర్యవేక్షణాధికారి ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు పవిత్ర జలధారల జలాల్లో నానబెట్టారు.

24న ఐకానిక సిటీ ఆఫ్ గోల్డ్‌కు శంకుస్థాపన

» మొదటి దశలో 180 విల్లాలు
» చైర్మన్ కె. మురళీకృష్ణ, ఎండీ కె. సంతోష్


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ మురళీకృష్ణ, ఎండీ సంతోష్

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ ఐటీ హిల్ నెంబరు 3 సమీపంలో ఉన్న 97 ఎకరాల్లో ఐకానిక సిటీ ఆఫ్ గోల్డ్ పేరుతో టౌన్ షిప్ అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఆ సంస్థ చైర్మన్ కె. మురళీకృష్ణ, ఎండీ కె. సంతోష్ తెలిపారు. ఆదివారం వారు హోటల్ డాల్ఫిన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 24న త్రిదండి చిన్నజీయర్‌స్వామితో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తామని చెప్పారు. మొదటి దశలో 4,500 నుంచి 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల 180 విల్లాలు నిర్మిస్తామన్నారు. కమర్షియల్ కాంప్లెక్స్‌లు, కన్వెన్షన్ సెంటర్, ఫైవ్ స్టార్ హోటల్, ఐటీ టవర్స్ ప్రీమియం అపార్ట్‌మెంట్స్ వంటి నిర్మాణాలు దశలవారీగా వస్తాయని వెల్లడించారు. 45 వేల చదరపు అడుగుల్లో విశాలమైన క్లబ్ హౌస్ కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. విశాఖ, తిరుపతిలో ఫైవ్ స్టార్ హోటళ్లు అందుబాటులోకి తీసుకువస్తామని, రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టాలన్న ఉద్దేశంతో విశాఖలో శ్రీరామ్ ప్రాపర్టీస్ దగ్గర విల్లాల నిర్మాణం చేపట్టామన్నారు. ఎన్‌సీసీకి చెందిన భూమిలో ఐకానిక సిటీ ఆఫ్ గోల్డ్ టౌన్ షిప్ తీసుకువస్తున్నామని వివరించారు. రియల్ ఎస్టేట్ రంగంలో తమకు 25 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉందని, బెంగళూరులో గార్డెన్ సిటీ రియల్టర్స్ పేరుతోను, హైదరాబాద్‌లో సైబర్ సిటీ పేరుతోనూ వేలాది అపార్ట్‌మెంట్‌లు, విల్లాలు విక్రయించామని చెప్పారు. నిర్మాణ రంగంలో ప్రప్రథమంగా గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్ ప్రవేశపెట్టామన్నారు. అనంతరం వారు ఐకానిక సిటీ ఆఫ్ గోల్డ్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు డా. కె. హేమలత



మాట్లాడుతున్న సీఐటీయూ జాతీయ అధ్యక్షులు హేమలత

డాబాగార్డెన్స్ ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న జరిగే అఖిల భారత్ సమ్మెను అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు డా. కె. హేమలత పిలుపునిచ్చారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం 4 లేబర్ కోడ్‌లను అమలు చేసిందని విమర్శించారు. కార్మిక సంఘాలను బలహీనం చేయడానికి, శ్రమదోపిడీ చేయడానికి, పని భారం పెంచడానికే కేంద్రం లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని చెప్పారు. కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇస్తూ సామాన్యులపై భారం వేస్తోందని ఆరోపించారు. నిత్యావసరాల ధరలను దృష్టిలో పెట్టుకుని కార్మికులకు నెలకు కనీసం రూ. 26 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణనను ఆపాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ పోరాటాలతోనే హక్కులు సాధ్యమని, ఐక్యపోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు జి. బేబిరాణి, నాయకులు ఉమామహేశ్వరరావు, అజయ్‌కుమార్, సుబ్బరావమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రైల్వే అంతర్ డివిజన్ ఫుట్‌బాల్ టోర్నీ

విజేతగా డిఫెండింగ్ చాంపియన్ ఆపరేటింగ్...రన్నరప్‌గా ఆర్పీఎఫ్


రన్నరప్‌గా నిలిచిన ఆపరేటింగ్ జట్టు సభ్యులు

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : తూర్పు కోస్తా రైల్వే వాల్తేరు డివిజన్ స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహించిన డివిజన్ అంతర్ శాఖల ఫుట్‌బాల్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ ఆపరేటింగ్ శాఖ వరుసగా రెండోసారి విజేతగా నిలిచింది. ఆర్పీఎఫ్ రన్నరస్‌గా స్థానాన్ని దక్కించుకున్నది. ఫైనల్స్‌లో ఆపరేటింగ్ 2-1 గోల్స్ తేడాతో ఆర్పీఎఫ్‌పై విజయం సాధించింది. రసవత్తరంగా సాగిన ఈ మ్యాచ్ తొలి భాగంలో ఆర్పీఎఫ్ ఒక గోల్ చేసి ఆధిక్యత సాధించగా, ఆపరేటింగ్ స్ట్రయికర్ రవికుమార్ అద్భుతమైన గోల్ చేసి స్కోరు సమం చేశారు. రెండో భాగంలో రవికుమార్ మరో గోల్ చేసి జట్టును చాంపియన్స్‌గా నిలబెట్టాడు. ఫైనల్స్‌లో తలపడిన ఇరుజట్ల ఆటగాళ్లను రైల్వే స్పోర్ట్సు ప్రధాన కార్యదర్శి, ధ్యాన్‌చంద్ అవార్డీ ఎన్.ఉష అభినందించగా రైల్వే ఫుట్‌బాల్ ప్రతినిధులు శ్రీనివాస్, గణేష్, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

ఇది శుభపరిణామం

మేయర్‌పై అవిశ్వాసం నెగ్గడంపై జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్



సీతంపేట, ఏప్రిల్ 20, (ఆంధ్రజ్యోతి) : విశాఖ వాసులు, విశాఖపట్నం అంతా కలిసి చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారని, జీవీఎంసీలో తొలిసారి కూటమి మేయర్ పాలన కావాలని కోరుకున్నారని, ప్రజాస్వామ్యంగా చట్టబద్ధంగా రాజ్యాంగబద్ధంగా కూటమి విజయం సాధించిందని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ పేర్కొన్నారు. ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మూర్తియాదవ్ మాట్లాడుతూ జగన్ అరాచక పాలన పోయి తొమ్మిది నెలలు అయిన తర్వాత సరికొత్త అభివృద్ధి జీవీఎంసీలో రావడానికి పురుడు పోసుకుందని వ్యాఖ్యానించారు.

బియ్యం కార్డుల్లో ఒడిశా వాసుల పేర్లు

... 5వ పేజీ తరువాయి

బంధువులు, స్నేహితులతో పాటు బాగా నమ్మకస్తులైన కార్డుదారులను ఎంపిక చేసుకుని ఒడిశా ఆధార్ నంబర్లతో పలువురి పేర్లను నమోదు చేయించారని ప్రచారం సాగుతుంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో బియ్యం కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం ఇచ్చినప్పుడు కొందరు డీలర్లు అప్పటి పౌర సరఫరాల శాఖ సిబ్బంది సహకారంతో ఈ తప్పుడు వ్యవహారానికి పాల్పడినట్టు చెబుతున్నారు. గోపాలపట్నం, వేపగుంట ప్రాంతంలో ఒక డీలర్ పరిధిలో ఎక్కువగా ఐదారుగురు కుటుంబ సభ్యులున్న కార్డులు ఉన్నాయి. ఈ విధంగా నెలకు టన్ను బియ్యం పక్కదారి పట్టిస్తున్నారని అంటున్నారు. ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న 1,02,076 మందిలో ఐదో వంతు నకిలీలు ఉండే అవకాశం ఉందని మర్రిపాలెం ప్రాంతానికి చెందిన కొందరు డీలర్లు అంటున్నారు. అలాగే చనిపోయిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి పేర్లను కార్డుల నుంచి తొలగించకుండా కొంతమంది ఐదు కిలోల వంతున బియ్యం తీసుకుంటున్నారు. ఏదేమైనా నెలాఖరులోగా ఈకేవైసీ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న వారి వివరాలను ప్రతి డీలర్‌కు పౌర సరఫరాల శాఖ అందజేసింది. డీలర్లు ప్రతి కార్డుదారుడికి ఫోన్ చేసి ఈకేవైసీ చేయాలని కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతం కంటే నగరంలో ఈకేవైసీ పూర్తి చేయాల్సిన వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంది.

ఏయూ శతాబ్ది ఉత్సవాలకు సన్నాహాలు

... 5వ పేజీ తరువాయి

నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ నెల 26న ప్రారంభ వేడుకలను ఏయూలోని ఆయా విభాగాల్లో ఘనంగా నిర్వహించనున్నారు. అలాగే అదేరోజు ఉదయం వర్సిటీ ప్రాంగణంలో శతాబ్ది వేడుకల బెలూన్స్‌ను ఎగురవేయనున్నారు. అనంతరం కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. ఆ తరువాత సాగర తీరంలో సెంటినరీ వాక్‌థాన్‌ను నిర్వహిస్తారు. సాయంత్రం బీచ్ రోడ్డులోని కన్వెన్షన్ హాల్‌లో శతాబ్ది ఉత్సవాలను చేపడతారు.

పలు కమిటీల నియామకం

శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు వీసీ రాజశేఖర్ పలు కమిటీలను ఏర్పాటు చేశారు. వేడుకలను అట్టహాసంగా నిర్వహించే బాధ్యతను ఆయా కమిటీలు చూసుకుంటాయి. ఇందులో వీసీ జీపీ రాజశేఖర్ నేతృత్వంలోని యూనివర్సిటీ లెవెల్ కోర్ కమిటీ ఒకటి. దీనికి చైర్మన్‌గా వీసీ వ్యవహరిస్తున్నారు. రిజిస్ట్రార్ కన్వీనర్ అండ్ మెంబర్ సెక్రటరీ కాగా, రెక్టార్‌తో పాటు ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీలో చైర్మన్‌తో సహా 14 మంది ఉన్నారు. దీనినే సెంటినరీ సెలబ్రేషన్ కమిటీగా పరిగణిస్తున్నారు. అదేవిధంగా ఈవెంట్స్ మేనేజ్‌మెంట్ కమిటీ, లోగో సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా ఏయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజును నియమించారు. పూర్వ విద్యార్థుల సంబంధాల కమిటీ చైర్మన్‌గా ఏయూ మహిళాఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మశ్రీ, డాక్యుమెంటేషన్ అండ్ లెగసీ చైర్మన్‌గా రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్ బాబు, మీడియా రిలేషన్స్ చైర్మన్‌గా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు, ఫండ్ రైజింగ్ కమిటీ చైర్మన్‌గా ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గిరిజాశంకర్‌ను నియమించారు. వీటితో పాటు మరికొన్ని కమిటీలను నియమించినట్టు తెలిసింది.

డీఎస్సీ..

... 5వ పేజీ తరువాయి

పడింది. గడిచిన మూడేళ్లలో ప్రభుత్వ యాజమాన్య ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. దీంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 420 ఎస్జీటీ టీచర్లను మిగులుగా చూపిస్తున్నారు. దీనికితోడు టీచర్, విద్యార్థి నిష్పత్తి మేరకు ఖాళీలను భర్తీ చేస్తుండడంతో ఎస్జీటీల నియామకాలను తక్కువగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే గత ప్రభుత్వం తీసుకువచ్చినజీవో 117ను రద్దు చేసిన ప్రస్తుత ప్రభుత్వం... కొత్త విధానాలను అమలు చేయనున్నది. ఇందువల్ల మోడల్, బేసిక్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నందున వచ్చే ఏడాదికి పిల్లల చేరికపై కొంత పురోగతి ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత డీఎస్సీలో తక్కువ పోస్టులను మాత్రమే భర్తీ చేస్తున్నందున ఆశావహుల మధ్య తీవ్ర పోటీ ఉంటుందని చెప్పవచ్చు.

ఏజెన్సీలో 400 ఖాళీలు

ఉమ్మడి విశాఖ జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 400 ఖాళీలను భర్తీ చేయనున్నారు. మూడేళ్ల క్రితం వరకు జీవో నంబరు-3 ప్రకారం ఏజెన్సీలో వున్న టీచర్ పోస్టులన్నీ గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేసేవారు. అయితే ఈ జీవోను 2022లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కారణంగా ఐదో షెడ్యూల్‌లో వున్న ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగాలకు గిరిజనులతోపాటు గిరిజనేతరులకు అవకాశం వచ్చింది. గత ఏడాది సాధారణ ఎన్నికల సమయంలో జీవో నంబరు-3 పునరుద్ధరణకు కృషి చేస్తానని విపక్షనేత హోదాలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అన్ని పోస్టులను గిరిజనులతో భర్తీచేయాలని ఆదివాసీ అభ్యర్థులు కోరుతున్నారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణ

... 5వ పేజీ తరువాయి

అందుబాటులో ఉండాలని ఆదేశించామన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా అనేక గ్రామాలకు తాగునీరు అందుతున్నదని, ఇప్పటికే ఉన్న రక్షిత నీటి పథకాల నుంచి ఇంటింటికీ కొళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తున్నాని చెప్పారు.

ఆర్థిక సంఘం నిధులతో 725 పనులు

గత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలివిడత కింద 15వ ఆర్థిక సంఘం ద్వారా జడ్పీకి వచ్చిన రూ.14 కోట్లతో ఉమ్మడి జిల్లాలో రోడ్లు, డ్రైన్లు, బోర్ల మరమ్మతులు వంటి 725 పనులు మంజూరుచేయగా ఇంతవరకు 200కు పైగా పనులు పూర్తిచేసి రూ.ఆరు కోట్ల వరకు బిల్లులు చెల్లించామన్నారు. వాస్తవంగా ఈ పనులు మార్చి నెలాఖరులోగా పూర్తికావల్సి ఉందని, అయితే పలు కారణాల వల్ల కొంత జాప్యం జరిగిందని పేర్కొంటూ జూన్ నెలాఖరుకు పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు ఇంకా విడుదల కావల్సి ఉందన్నారు.

కాగా ఆర్థిక సంఘం నిధుల్లో ఇప్పటివరకు పంచాయతీలకు 70 శాతం, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు 15 శాతం చొప్పున వచ్చేవని, అయితే తాజాగా చేసిన మార్పుల చేసిన మేరకు మండల పరిషత్‌లకు 20 శాతం, జడ్పీలకు 10 శాతం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రహదారులు, ఇతర పనులకు రూ.20 కోట్లు, తాగునీటి పథకాలకు రూ.10 కోట్ల వ్యయానికి పాలనాపరమైన ఆమోదం తెలిపినట్టు సీఈవో పేర్కొన్నారు. సాధారణ నిధులు రూ.20 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వీటికి సంబంధించి ఇంత వరకు రూ.ఏడు కోట్ల విలువైన బిల్లులు సీఎంఎఫ్ఎస్‌కు అప్‌లోడ్ చేశామన్నారు.

అన్ని జడ్పీ హైస్కూళ్లకు ప్రహరీ గోడలు

ఉమ్మడి విశాఖ జిల్లాలో జడ్పీ ఉన్నత పాఠశాలల ఆస్తుల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని జడ్పీ సీఈవో నారాయణ మూర్తి తెలిపారు. ప్రతి పాఠశాల చుట్టూ ప్రహరీగోడ వుండాలనే నిబంధన అమలుచేశామన్నారు. ఇప్పటి వరకు ప్రహరీగోడలు లేని పాఠశాలలకు సమగ్ర శిక్ష, ఉపాధిహామీ పథకం నిధులతో గోడలు నిర్మిస్తామని చెప్పారు. ప్రతి ఉన్నత పాఠశాల ఆస్తులకు సంబంధించి ఆయా మండల తహసీల్దార్ల నుంచి ఫెయిర్ అడంగల్ కాపీలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీపీ పాఠశాలల ఆస్తుల విషయంలో ఆయా మండల పరిషత్ అధికారులకు ఇప్పటికే సూచనలు చేశామని సీఈవో వెల్లడించారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

పెందుర్తి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో అదృశ్యమైన ఓ బాలుడిని పోలీసులు ఆదివారం తల్లిదండ్రులకు అప్పగించారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పాపయ్యరాజుపాలేనికి చెందిన పెయింటింగ్ కాంట్రాక్టర్ గౌతమ్ కుమారుడు యశశ్చంద్ర(14) సుజాతనగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాల పూర్తయిన తరువాత యశశ్చంద్ర సైకిల్‌పై ఇంటికి బయలుదేరాడు. అయితే ఇంటికి చేరకపోవ డంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది స్నేహితులు, బంధువుల ఇళ్లకు వెళ్లి వెదికారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గాలించారు. అయితే ఆదివారం ఉదయం పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు ఓ వ్యక్తి వచ్చి ఆ బాలుడిని పోలీసులకు అప్పగించారు. దీనిపై సీఐ ఆరా తీయగా, విద్యార్థి కళ్లు తిరిగి పడిపోయి ఉండ డాన్ని గమనించి ఇంటికి తీసుకువెళ్లి సపర్యలు చేసినట్టు సరిపల్లికి చెందిన ఆ వ్యక్తి తెలిపాడు. ఆ బాలుడి తల్లిదండ్రులకు పోలీసులు సమాచారం ఇచ్చి వారికి అప్పగించారు. చదువుకోమని తల్లిదండ్రులు మందలించడంతో ఆందోళన చెందిన బాలుడు స్కూల్ నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో నీరసించి కళ్లు తిరిగి పార్కులో పడిపో యాడని సీఐ తెలిపారు. తమ కుమారుడిని క్షేమంగా అప్పగించిన పోలీసులకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

బీడు భూముల్లో పండ్ల తోటల పెంపకానికి పేర్లు నమోదు

పెందుర్తి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా బీడు భూముల్లో పండ్ల తోటల పెంపకానికి ఈ నెల 21, 22 తేదీల్లో మండలంలోని 15 పంచాయతీ కార్యాలయాల్లో పేర్లు నమోదు కార్యక్రమాన్ని ఎన్ఆర్జీఎస్ అధికారులు చేపట్టనున్నారు. ఈ క్రమంలో సచివాలయ వ్యవసాయ సహాయకుడు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు వీఆర్వో, గ్రామ సర్వేయర్ల బృందం ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉంటారు. పేర్లు నమోదు చేసుకుని అర్హులైన రైతులకు ఉపాధి నిధులతో మూడేళ్ల పాటు తోటల పెంపకానికి చర్యలు తీసుకుంటారు. ఆసక్తి గల రైతులు ఆయా పంచాయతీ కార్యాలయాల్లో సంప్రతించాలి.

పార్కుల్లో శ్రమదానం

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్‌లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా వాకర్స్ పార్కుల్లో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానం చేశారు. అనంతరం పాలిథీన్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని కోరుతూ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ తిరుమలనగర్ నుంచి వడ్లపూడి చేపల మార్కెట్ వరకు సాగింది. చికెన్, మటన్, చేపల కొనుగోలు చేసి అందరూ స్టీలు బాక్సులు, జ్యూట్ బ్యాగులలో తీసుకువెళ్లాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వర్మ, జగన్నాథం, భద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)
- **జాక్ :** రమాదేవి
- **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 16, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 24, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 32, బీరకాయలు 38, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 14, క్యారెట్ 34 దొండకాయలు 20, బంగాళదుంపలు 18, అరటికాయ(పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం(పాతది)48, బరబాటి22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 54, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 24, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు34, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర 3, పాలకూర 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడిఅల్లం 48, బొప్పాయి42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220


గాజువాకలో కేక్ కట్ చేసిన అనంతరం మాట్లాడుతున్న ప్రసాదుల శ్రీనివాస్


70వ వార్డులో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న యువకులు

రాష్ట్ర ప్రగతే చంద్రబాబు ధ్యేయం

- టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్
- పలు ప్రాంతాల్లో ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

గాజువాక, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రగతే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలన సాగుతుందని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం చంద్రబాబు జన్మదిన వేడుకలను పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఇక్కడి పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం ప్రసాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ 75 ఏళ్ల వయసులోనూ ప్రజల, రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలనే సంకల్పంతో ఉన్న మహోన్నత వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు. ఈ సందర్భంగా అన్న క్యాంటీన్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, బొండా జగన్, నాయకులు శ్రీనివాసవర్మ, అనంత్, శివప్రసాద్, నమ్మి సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను 70వ వార్డు పరిధి డ్రైవర్స్ కాలనీలో పార్టీ నాయకులు, ఈస్టర్న్ నేవల్ కమాండ్ (టీఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ అనంతరం ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ పర్యవేక్షణలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ వార్డు ఇన్‌చార్జి చట్టి గోపి, అధ్యక్షుడు కేవీఎస్ శంకరరావులు మాట్లాడుతూ కార్యకర్తలే టీడీపీకి శ్రీరామరక్ష అని నమ్మే ఏకైక వ్యక్తి చంద్రబాబునాయుడు అని అన్నారు. నాయకులు పీఎంఎల్ నాయుడు, ఎంఎస్ఎన్ రాజు, వీబీఎల్ మూర్తి, రాజా, నూకరాజు, టీవీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: స్వర్ణాంధ్ర సృష్టికర్త సీఎం చంద్రబాబునాయుడు పుట్టినరోజు సంబరాలను ఆదివారం రాత్రి వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్ సిటీలో ఫార్మా ఉద్యోగ సంఘ ప్రతినిధుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీవీ కృష్ణారావు కేకు కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, విద్య, వైద్య రంగాలలో తనదైన ముద్ర వేస్తూ అహర్నిశలు ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. ఫార్మా ఉద్యోగ సంఘ ప్రతినిధి పొన్నగంటి మురళీకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు రాజ్యలక్ష్మి, శ్రీను, వెంకటరావు, రామారావు, సునీల్, గణేశ్, నానాజీ తదితరులు పాల్గొన్నారు. అలాగే 86వ వార్డు పరిధి మాతృశ్రీ నగర్‌లో టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలందరూ ప్రజా సంక్షేమం కోసం సైనికుల్లా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, ఎం.కనకరాజు, నాగార్జున, సుబ్బయ్య, గణపతి, తదితరులు పాల్గొన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడి లోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ కేక్ కట్ చేశారు. అనంతరం కణితి పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, ఎస్.కనకరాజు, శ్రీనివాస నాయుడు, డీవీ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



86వ జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న నల్లూరు సూర్యనారాయణ


ఫార్మా ఉద్యోగుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీవీ కృష్ణారావు

అగనంపూడి: సీఎం చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ కేక్ చేశారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలోని రోగులు, బాలింతలకు పాలు, పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. నాయకులు గల్లా రాజు, రుద్రకుమార్, కె.పైడిరాజు, జి.కనకభవానీ, సూర్యనారాయణ, సత్యారావు, పాల్గొనారు. అలాగ టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర ఆధ్వర్యంలో చంద్రబాబు కలకాలం ఆరోగ్యంగా ఉండాలని కాంక్షిస్తూ సంపత్ వినాయక ఆలయంలో పూజలు చేశారు.

అక్కిరెడ్డిపాలెం: తుంగ్లాంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద వార్డు కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని ఆయన న్నారు. కార్యక్రమంలో నాయకులు నావన సింహచలం, పి.అర్జున్, కె.అప్పలరెడ్డి, వెంకట అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే అక్కిరెడ్డిపాలెంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి కేక్ చేశారు. నాయకులు బి.వెంకటరమణ, జి.తాతారావు, డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: రాష్ట్ర ప్రజలకు మేలు చేయడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయడుఉ ఆశయమని జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ 76వ వార్డు కార్యాలయంలో ఆయన కేక్ చేసి అందరికీ పంచిపెట్టిరు. కార్యక్రమంలో నాయకులు బాసెట్టి అప్పారావు, సుదర్శన్, కె.వెంకటరావు, పి.ఉగ్రం తదితరులు పాల్గొన్నారు. అలాగే 65వ వార్డు పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు కేక్ కట్ చేశారు. ఆర్థికంగా నష్టపోయిన రాష్ట్రానికి చంద్ర బాబు ఊపిరి పోశారన్నారు. నాయకులు కర్రి కృష్ణ, ఈశ్వరరావు, సుజాత,కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే టీడీపీ 75వ వార్డు కార్యాలయంలో పార్టీ జిల్లి ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం పెదగంట్యాడ పీహెచ్‌సీ ఓపీ విభాగంలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా సీఎం చంద్రబాబునాయుడు పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నమ్మి అప్పారావు, పెద్దాడ సోమునాయుడు, ఎం.పెంటయ్య, శ్రీముసురు శ్రీనివాసరావు, ఎం.రమణబాబు, దొమ్మేటి అప్పారావు, తదతరులు పాల్గొన్నారు.

దార్శనికుడు సీఎం చంద్రబాబు

- ఎమ్మెల్యే గణబాబు
- ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

గోపాలపట్నం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికుడని, విజనరీ నేత అని ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గోపాలపట్నంలో ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో ఆదివారం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణబాబు కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. కార్యక్రమంలో భాగంగా హిందూ, ముస్లిం, క్రైస్తవ పండితులతో చంద్రబాబు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో 89, 90, 91, 92 వార్డుల టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. 88వ వార్డు పరిధిలోని సత్తివానిపాలెం గ్రామంలో టీడీపీ వార్డు నేత ఒమ్మి సత్యం ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.


గోపాలపట్నంలో కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు తినిపిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రి అన్న క్యాంటీన్ ఎదురుగా జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే గణబాబు పాల్గొని కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ 58వ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, పార్టీ 60వ వార్డు అధ్యక్షుడు మాతా శ్రీను, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సీహెచ్ రామ్మోహన్ నాయుడు, జనసేన నాయకులు పుర్రె సురేశ్, బీజేపీ నాయకులు పోలిమేర శ్రీను, టీడీపీ 58వ వార్డు ప్రధాన కార్యదర్శి పొత్తబత్తుల శ్రీను, పార్టీ 59వ వార్డు ప్రధాన కార్యదర్శి మితిరెడ్డి శంకర్, పార్టీ 62వ వార్డు అధ్యక్షుడు మజ్జిమాలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిలో...

పెందుర్తి: సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను 96వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెందుర్తిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు కరక దేవుడు, ఆళ్ల రమేశ్, పీలా జితేంద్ర, పెంటకోట రాజేంద్రప్రసాద్, కిల్లి ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

లయోలాలో వృద్ధులకు అన్నదానం

సీఎం చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా మాజీ జడ్పీటీసీ సభ్యుడు రెడ్డి నారాయణరావు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ ఆర్థిక సహకారంతో పెందుర్తిలోని లయోలా వృద్ధాశ్రమంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత అవగడ్డ అప్పలనాయుడు, అన్నంరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

పురుషోత్తపురంలో..

పెందుర్తిరూరల్: సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల సందర్భంగా మాజీ సర్పంచ్, టీడీపీ వార్డు మాజీ అధ్యక్షుడు పిల్లల అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం పురుషోత్తపురంలో కేక్ కట్ చేసి కార్యకర్తలను తినిపించారు. అనంతరం వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.


పెందుర్తిలో వేడుకల్లో పాల్గొన్న జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు


శ్రీహరిపురంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

మల్కాపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో ఆదివారం ఈస్టర్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. సమాధుల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ప్రార్థనలు చేశా రు. అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

వేపగుంటలో..

వేపగుంట: స్థానిక ముత్యమాంబ కాలనీలోని బైబిల్ మిషన్ సమృద్ధి గృహ ప్రార్థనా మందిరంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు సందేశాన్ని చర్చి రెవరెండ్ ఫాదర్ సీహెచ్ సుందరరావు తెలియజేశారు. సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల సందర్భంగా మధ్యాహ్నం 4 గంటలకు టీడీపీ నేత బండారు అప్పలనాయుడు కేక్ కట్ చేసి అనంతరం నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ డేనిష్, సువర్ణరాజు, యోహన్, ఆంజనేయులు, అబ్రహం, స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.


కరాస శ్మశాన వాటిక వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న దృశ్యం

కరాస శ్మశాన వాటికలో ప్రార్థనలు

ఎన్ఏడీ జంక్షన్: జీవీఎంసీ 52వ వార్డు కరాస క్రైస్తవ శ్మశాన వాటికలో ఆదివారం ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. శ్మశాన వాటికలో శవపేటికలను పూలతో అలంకరించి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు ఆంథోని, డేవిడ్‌పాల్, వై.రాజు, వై.ప్రభుదాస్, సుధాకర్, హేన్రి, డానియల్ డియోఫిలాస్, తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో సేవియర్ లూథరన్ చర్చి, బుచ్చిరాజుపాలెం సెయింట్ ఆంథోని, ఎరుషలేము ప్రార్థనామందిరముల్లో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు.


ఛిద్రంగా మారిన ఇ-మర్రిపాలెం-పెదముషిడివాడ రోడ్డు

అధ్వాన రహదారితో అవస్థలు

రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

అగనంపూడి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఇ-మర్రిపాలెం నుంచి పెదముషివాడ వెళ్లే మెటల్ రోడ్డు అధ్వానంగా మారింది. సుమారు 15 ఏళ్ల క్రితం ఈ రోడ్డును నిర్మించారు. అప్పట్లో కొంతమేర బీటీ రోడ్డును నిర్మించి విడిచిపెట్టేశారు. మిగతాది మెటల్ రోడ్డు కావడంతో రహదారి పొడవునా పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. ఇ-మర్రిపాలెం, ఫార్మాసిటీ పునరావాస కాలనీవాసులు పెదముషివాడ, పరిసర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. అటువంటి రోడ్డు అధ్వానంగా మారడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

క్వారీ లారీల రాకపోకలతో రహదారి మొత్తం ఛిద్రంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతులకు తోడు ఈ మార్గంలో లైట్లు లేకపోవడంతో రాత్రిపూట ప్రయాణం చేసేందుకు భీతిల్లుతున్నామని పలు వురు వాపోతున్నారు. ఈ రహదారిని బీటి రోడ్డుగా నిర్మించాలని ఎన్నోసార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రహదారిని బీటీ రోడ్డుగా నిర్మించేందుకు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేత్రపర్వంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం


కల్యాణంలో భాగంగా మంగళసూత్రాలను చూపుతున్న అర్చకులు

గాజువాక, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 72వ వార్డు పరిధి కర్నవానిపాలెంలోని రామాలయ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. అర్చకుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణాన్ని జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు దంపతులు పూజల్లో పాల్గొనడంతో పాటు అన్న సమారాధనకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు అప్పారావు, మరిడమ్మ, కనకారావు, దేముడు, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌పై నిరుద్యోగుల హర్షం

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం


ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పర్యవేక్షణలో చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

విశాఖపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం వారు ద్వారకానగర్‌లోని వినెక్స్ శిక్షణ కేంద్రంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు ఆధ్వ ర్యంలో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నిరుద్యోగ అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం ఎంతోమేలు చేకూర్చేలా నిర్ణయం తీసుకుందన్నారు. శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న తమ ఆశలను ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఏయూలోని వీఎస్ కృష్ణా లైబ్రరీ వద్ద కూడా డీఎస్సీ అభ్యర్థులు చంద్రబాబునాయుడు, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అలాగే ఏయూలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆరేటి మహేష్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత సంబరాలు నిర్వహించారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

వృద్ధురాలి ఆత్మహత్య

పెందుర్తి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో ఉంటున్న టి.స్వర్ణలత(67) కొన్నేళ్లుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుంది. ఈక్రమంలో ఆదివారం వేకువజామున కుటుంబ సభ్యులు నిద్రస్తుండగా కడుపునొప్పికి తాళలేక తమ మేడపైనుంచి దూకడంతో తలకు తీవ్ర గాయాలై మృతి చెందింది. మృతురాలి భర్త కొండలరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనబడుట లేదు



పేరు: సోము కామేష్
వయస్సు: 35 సంవత్సరాలు
కలర్ : ఎరుపు
ఎత్తు : 5 అడుగుల 5 అంగుళాలు
ధరించిన దుస్తులు :గ్రీన్ బ్లాక్ కలర్ చెక్స్ షర్ట్ , సిమెంట్ కలర్ జీన్‌ఫ్యాంట్
మొబైల్: కీప్యాడ్ మొబైల్, 9959926344
గుర్తింపు: ఎడమకాలు కొంచెం వంగి ఉంటుంది. తలపై చిన్న వెంట్రుకలతో పాటు ఐబ్రోస్‌పై అడ్డంగా ఒక అంగుళం స్క్రాచ్ ఉంటుంది.
సంప్రదించాల్సిన నెంబర్లు: 8019100281, 8790067784, 9346443422, 9603028439

CLASSIFIEDS

LOST OF DOCUMENT

I, DHAVALESWARAPU VIJAYA LAKHSMI, W/o. D. Srinivasa Rao, R/o. D.No.5-12, MIG-A-12, Sagar Nagar, Visakhapatnam. I have lost my Property Sale Deed No.1060/2008 while I was travelling near APEPDCL Office at Madhurawada on 20-11-2024. If anybody found please contact me.
8977651622, 7989359332

సర్టిఫికెట్ పోయినది

దల్లి హేమరెడ్డి, D/o. దల్లి శ్రీనివాసరెడ్డి, గ్రీన్ గార్డెన్స్, మర్రిపాలెం విశాఖపట్నం, అను నేను తేది. 10-04-2025న మర్రిపాలెం నుండి ఎన్ఏడి బస్టాప్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో నా టెన్త్ క్లాస్ ఒరిజినల్ సర్టిఫికెట్ పోయినది ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.
Cell: 7569543926

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093